J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 23.10.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 21 పేజీలు : 14, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerpatrika.com




### న్యాయవ్యవస్థపై...

# జగన్ తిరుగుబాటుతో ఏం జరగబోతోంది?..

- ఇది అసాధారణ ఘర్షణ - రెండు ప్రధాన వ్యవస్థల మధ్య సంఘర్షణ
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయమే ఇప్పుడు కీలకం

***కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు...? ఐదేళ్ల క్రితం.. అంటే 2015లో రాజమౌళి బాహుబలి మొదటి భాగం విడుదలైన తరువాత అప్పట్లో దేశంలో ఎక్కువ చోట్ల వినిపిస్తుండిన ప్రశ్న అది.***

***న్యాయవ్యవస్థపై ఆంధ్రా సీఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన తిరుగుబాటు ఫలితం ఏమిటి..? పరిణామాలు ఎలా ఉండబోతున్నాయి..?? అదే తరహాలో అంతే స్థాయిలో సంచలనం కలిగించేలా ఇపుడు ప్రపంచవ్యాప్తంగా వున్న భారతీయులు వేసుకుంటున్న ప్రశ్న ఇది.***

రాజమౌళిది సినిమా, అక్కడ హీరో ప్రభాస్, అది నటన. ఇక్కడ జరిగింది వాస్తవ సంఘటన, ఇక్కడ హీరో జగన్. ఇది రెండు రాజ్యాంగ వ్యవస్థల మధ్య జరిగే యుద్ధం. ఒకటి ప్రజలచేత ఎన్నుకోబడిన శాసన వ్యవస్థ. ఇంకొకటి అన్ని వ్యవస్థలపై సమీక్షాధికారం కలిగిన న్యాయ వ్యవస్థ. ఇది అసాధారణ ఘర్షణ. బాధ్యతాయుతమైన రెండు ముఖ్య వ్యవస్థల మధ్య జరుగుతున్న సంఘర్షణ.

సాక్షాత్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేస్తూ, ఆ న్యాయమూర్తికి చెందిన ఆస్తుల లావాదేవీలు, రాష్ట్రంలో ప్రధానపార్టీ రాజ కీయ నేతతో ఆయనకి ఉన్న సన్నిహిత సంబంధ బాంధవ్యాలు హైకోర్టు న్యాయమూర్తులను ఆయన ప్రభావితం చేస్తున్న తీరు తదితర అంశాలతో కూడిన సుదీర్ఘ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నారావారి పల్లెలో రెండకరాల రైతు కర్జూరనాయుడు కొడుకుగా రాజకీయాల్లో అడుగుపెట్టి, వైయస్ రాజశేఖరరెడ్డి వంటి నాయకుల బ్రీఫ్‌కేసులు చంకతో పట్టి, నందమూరి తారకరామారావు (మిగతా 13వ పేజీలో)

## 'అచ్చెన్న' అచ్చొచ్చేనా?

### పొలిట్‌బ్యూరో సభ్యుడిగా మళ్ళీ సోమిరెడ్డి

### 'దేశం' జాతీయ ప్రధాన కార్యదర్శిగా బీద రవిచంద్ర



తెలుగుదేశం పార్టీ తమ భవిష్యత్ పోరాటాల కోసం కొత్త సైన్యాన్ని నియమించింది. అక్టోబర్ 25 విజయదశమి రోజున ఈ దళాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. కొత్తగా 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్ బీసీలకు అగ్ర తాంబూలం ఇచ్చిన తరుణంలోనే మేమేం తక్కువా? అన్నట్లుగా పార్టీలో (మిగతా 13వ పేజీలో)

## ఓం శ్రీమాత్రే నమః

### దుర్గమ్మకు సారె సమర్పించిన సీఎం జగన్




అక్టోబర్ 21వ తేదీ బుధవారం సాయంత్రం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ అమ్మవారికి సారె సమర్పించిన ముఖ్యమంత్రి జగన్

## బ్రహ్మాండం.. బ్రహ్మోస్త్రం

### మన సతీష్‌రెడ్డి సారథ్యంలో అద్భుత అస్త్రం

### బ్రహ్మోస్ క్షిపణి ప్రయోగం విజయవంతం



మన నెల్లూరీయుడు, భారత రక్షణ-పరిశోధన సంస్థ(డిఆర్‌డిఓ) ఛైర్మెన్ గుండ్రా సతీష్‌రెడ్డి సారథ్యంలో మరో శక్తివంతమైన అస్త్రం తయారైంది. బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని రూపొందించి విజయవంతంగా పరీక్షించడం ద్వారా.. భారత్ అమ్ములపొదిలో మరో బ్రహ్మాండమైన బ్రహ్మోస్త్రం చేరుకున్నట్లుయింది. 12లో



• జగన్ అనే నేను....

# వాహనదారులు రూలుతప్పితే తోలు వొలుస్తారు

## జరిమానాలను భారీగా పెంచుతూ కొత్త చిట్టా విడుదల చేసిన ప్రభుత్వం

'భరత్ అను నేను' సినిమాలో హీరో చేసిన తరహాలోనే ఇప్పుడు ఆంధ్రాలో జగన్ ప్రభుత్వం సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. మోటారు వాహనదారులు రూల్స్ పాటించకపోయినా, నిబంధనలు ఉల్లంఘించినా భారీ జరిమానాలతో తోలు వలవడానికి రంగం సిద్ధం చేసింది. ఇకపై వాహనచోదకులు అతివేషాలు వేస్తే వారి వేషాలకు తగ్గట్లే జరిమానాలు కూడా అతిగానే ఉండేలా ఉత్తర్వులు జారీచేసింది. ద్విచక్ర వాహనం నుండి 7 సీట్లు ఉండే కార్ల వరకు ఒక విధమైన జరిమానాను వసూలు చేస్తారు, భారీ వాహనాలకు జరిమానా కూడా భారీగానే నిర్ణయించారు.



కొత్త జరిమానాల వివరాలను ఒక సారి పరిశీలిస్తే... వాహన చెకింగ్ విధులకు ఆటంకం కలిగిస్తే – రూ.750, సమాచారం ఇవ్వడానికి నిరాకరిస్తే – రూ.750, అనుమతి లేని వ్యక్తులకి వాహనం ఇస్తే – రూ.5000, అర్హత కంటే తక్కువ వయస్సు వారికి వాహనం ఇస్తే – రూ. 5000, డ్రైవింగ్ లైసెన్స్ పొందే అర్హత లేని వారికి వాహనం ఇస్తే – రూ. 10000, రూల్స్‌కి వ్యతిరేకంగా వాహనాల్లో మార్పులు చేస్తే – రూ.5000, వేగంగా వాహనం నడిపితే – రూ.1000, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా, ప్రమాదకరంగా బండి తోలినా మొదటి సారి రూ.1500 నుంచి రూ.2,000 వసూలు చేస్తారు, మూడేళ్ళలోగా రెండో సారి దొరికితే ఏకంగా రూ.10,000లు జరిమానా విధిస్తారు. డ్రైవింగ్ చేసేవారికి సీట్ బెల్టు లేకున్నా, డ్రైవింగ్ సీట్ పక్క సీటులో ఉన్నవారు సీటు బెల్టు వేసుకోకపోయినా రూ.1000లు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే ఇకపై పట్టుకుంటే అక్కడికక్కడే రూ.1,000లు కట్టాలి. రేసింగ్‌లో పాల్గొంటే మొదటి సారికి రూ.5000, రెండోసారి దొరికితే రూ.10000తో వాయిస్తారు.

రిజిస్ట్రేషన్ లేకున్నా, ఫిట్నెస్ సర్టిఫికేట్ లేకున్నా – మొదటిసారికి రూ. 2000, రెండోసారి పట్టుకుంటే రూ.5000, పర్మిట్ లేని వాహనాలు వాడితే – రూ. 10000, ఓవర్‌లోడ్‌తో పట్టుబడితే నికరంగా రూ.20000 ఆపైన అధికంగా వున్న లోడుపై టన్నుకి రూ.2000 ముక్కు పిండి వసూలు చేస్తారు.

వాహనం బరువు చెకింగ్ కోసం ఆపకపోతే – రూ.40000, అంబులెన్సులు, ఫైర్ ఇంజన్లు, పోలీస్ వాహనాలు వంటి ఎమర్జెన్సీ వాహనాలకు దారి ఇవ్వకుంటే – రూ. 10000, అనవసరంగా హారన్ మోగిస్తే మొదటిసారి రూ. 1000, రెండోసారి రూ.2000 చలానా రాస్తారు.

రూల్స్‌కి వ్యతిరేకంగా వాహనానికి మార్పు చేర్పులు చేస్తే తయారీ సంస్థలకు లేదా డీలర్లకు, అమ్మినవారికి – లక్ష రూపాయలు పెనాల్టీ వేస్తారు. వాహనదారులూ పారా హుషార్.

# పోలీసుల సంక్షేమానికి పెద్దపీట

## ప్రజలకు అండగా ఉండేది పోలీసులే - మంత్రి డా.అనిల్



పోలీసుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారి అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 21న నెల్లూరు పోలీసు పెరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి అనిల్ మాట్లాడుతూ దేశ రక్షణలో, సమాజంలో అంతర్గత శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలు నిరుపమానమని, వారి ఆశయసాధనకు అందరం కృషిచేద్దామని అన్నారు. కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ విధినిర్వహణలో మృతిచెందిన పోలీసుల త్యాగాలను ఏనాటికీ మరువలేమన్నారు. కోవిడ్ కట్టడి కోసం పోలీసులు చేస్తున్న కృషి అమూల్యమైనదన్నారు.

ఎస్పీ భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, పోలీసులు సమాజానికి మరింత మెరుగైన సేవలందించాలని అన్నారు. తొలుత వారు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలుంచి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేసీ హరేంద్రప్రసాద్, ట్రైనీ ఐపిఎస్ మహేశ్వర్ రెడ్డి, ఏఎస్పీలు వెంకటరత్నం, వీరభద్రుడు, శ్రీధర్‌రావు, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విధినిర్వహణలో మృతిచెందిన వారి కుటుంబాలకు మంత్రి అనిల్ చేతుల మీదుగా ఎక్స్‌గ్రేషియా, వెల్ఫేర్ చెక్కులను పంపిణీ చేశారు.

# కరోనాతో అప్రమత్తంగా ఉండాలి




కరోనాతో అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనిల్ చెప్పారు. ఈనెల21న నెల్లూరులో కార్పొరేషన్, వైద్యారోగ్యశాఖల ఆధ్వర్యంలో నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి ఆర్టీసి బస్టాండ్ వరకు గొడుగులు చేతపట్టి నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ కరోనాపై నిర్లక్ష్యం వద్దని, మాస్కులు వేసుకుని భౌతికదూరం పాటిస్తూ కరోనాను కట్టడిచేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదప్రజలకు ఉచితంగా కరోనా చికిత్సలు కూడా అందిస్తున్నామన్నారు. కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీ ప్రభాకర్‌రెడ్డి, కమిషనర్ దినేష్‌కుమార్, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, అడిషనల్ డిఎంహెచ్ఓ స్వర్ణలత, డాక్టర్ ఉమామహేశ్వరి, మెప్మా పి.ఓ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విపిఆర్‌కి ధన్యవాదాలు



ఆంధ్రప్రదేశ్ బొందిలి వెల్ఫేర్ & డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మెన్‌గా తనను, డైరెక్టర్లుగా తన సహచరులను ఎంపిక చేయడంలో సహకరించిన రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అక్టోబర్ 21న ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న ఛైర్మెన్ ఎస్.కిషోర్‌సింగ్ మరియు డైరెక్టర్లు

# ఫ్లైఓవర్ శంకుస్థాపన హర్షణీయం

## - మిఠాయిలు పంచిన బిజెపి నాయకులు



స్వీట్లు పంచుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్

నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డు కూడలిలో ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన జరగడం ఎంతో హర్షణీయమని, సుమారు 42 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ నిర్మాణంతో నెల్లూరు నగర ట్రాఫిక్ సమస్య తీరుతుందని బిజెపి నాయకులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 61 రోడ్లకు ఒకేసారి శంకుస్థాపన జరగడం తమకెంతో ఆనందంగా ఉందంటూ స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ప్రధాని మోడీకి, కేంద్ర రహదారులమంత్రి నితిన్ గడ్కరీలకు ధన్యవాదాలు చెప్పారు. ఈనెల 16న ముత్తుకూరు రోడ్డు కూడలిలో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, రాధాకృష్ణగౌడ్, మిడతల రమేష్, కరణం భాస్కర్, ఇండ్ల రాఘవేంద్ర, యరబోలు రాజేష్, గడ్డం విజయకుమార్, యాకసిరి ఫణిరాజు, గుర్రం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 7.76 లక్షల మందికి 'వైయస్సార్ బీమా' రక్ష

పేదలు విధివశాత్తూ ప్రమాదాలకు గురైతే ఆ కుటుంబాలకు చేదోడుగా ఉండేందుకు వైయస్సార్ బీమా పథకాన్ని ఈనెల21న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రారంభించారు. జిల్లాలో 7.76లక్షల మందికి ఈ పథకం వర్తిస్తుంది. ప్రతి కుటుంబం సంతోషంగా జీవించాలన్న ఉద్దేశ్యంతో ప్రతిఒక్కరికీ ఈ పథకాన్ని వర్తింజేసేందుకు ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేస్తోండడం పట్ల ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ పథకం ద్వారా జిల్లాలోని 7,76,800 మంది బియ్యం కార్డుదారులకు లబ్ది చేకూరుతుంది. బియ్యం కార్డుదారులందరికీ ఇన్సురెన్స్ ప్రీమియం నగదును ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ పథకం కింద లబ్దిదారులెవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబాలకు 5 లక్షల పరిహారం, సహజమరణానికి 2 లక్షల పరిహారం ఇచ్చేలా ఈ పథకాన్ని రూపొందించారు.

# పందిళ్ళపల్లికి మంత్రి పరామర్శ



ఇటీవల మరణించిన పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి నివాసానికి వెళ్లిన మంత్రి అనిల్ పట్టాభిరామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుమారుడు పందిళ్ళపల్లి హేమంత్‌ను పరామర్శించాడు. పందిళ్ళపల్లి కుటుంబంతో, అరుణమ్మతో పట్టయ్యతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నాడు.

## అసలే కరోనా నామ సంవత్సరం .. ఆ పై నవంబరు వస్తోంది

# ముందే మేలుకోండి

పబ్లిక్ డిమాండ్



గతంలో ఎల్లవతో కాలువలా తయారైన నెల్లూరు నగరంలోని ఓ రోడ్డు

***నెల్లూరు నగరం వానొస్తే నరకం. ఇది ఇప్పటి మాట కాదు, ఎన్నో ఏళ్లుగా నెల్లూరు నగరవాసులు వానాకాలం ఆలపించే పాట. నిజమే నెల్లూరులో ఏడాదిలో 11నెలలు ఎండలే, వానలొచ్చేది ఒక్క నవంబర్‌లోనే. అదీ ప్రతి నవంబరులో వస్తాయన్న గ్యారంటీ కూడా లేదు. 2015 వరదల తరువాత మళ్లీ అందులో సగం శాతం వానలు కూడా ఈ ఐదేళ్ళలో పడలేదనుకోండి. కానీ, ఓ మోస్తరు వానలు వచ్చినా నగరవాసుల పరిస్థితి మాత్రం అల్లకల్లోలమే.***

పార్టీలు మారుతున్నాయి, ప్రభుత్వాలు మారుతున్నాయి, నాయకులూ మారుతున్నారు... కానీ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ మాత్రం మారడంలేదు. గత ప్రభుత్వంలో వందల కోట్లు నిధులు తెచ్చి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో రోడ్లన్నీ తొవ్వేసి, రాత్రికి రాత్రే నాసిరకం పైపులేసి, అప్పటికప్పుడే పూడ్చేసి కాంట్రాక్టర్ల జేబులు నింపేసి, దొరికినకాడికి దోచేసి, మమ అనిపించుకున్నారు తప్ప ప్రజలకి ఆ పనుల వల్ల ఒరిగిన ప్రయోజనం ఏ మాత్రం లేదు. కోట్ల రూపాయలు తగల బెట్టేశారు తప్ప ఇప్పటికీ చిన్నపాటి వర్షాలొచ్చినా నీళ్లన్నీ రోడ్లపైనే నిలిచిపోతున్నాయి. వాల్ టు వాల్ పేరుతో రోడ్లను వేసి, రోడ్లకు షోల్డర్‌లను(బరమ్స్) లేకుండా చేసి, పడ్డ నీళ్లు ఇంకిపోవడానికి కూడా అవకాశం లేకుండా చేసేశారు మహానుభావులు. గతంతో పోలిస్తే ఇప్పుడు సమస్య ఇంకా జఠిలమయ్యిందనే చెప్పాలి.

ఇప్పుడు మళ్ళీ నవంబరు రాబోతోంది. అసలే ఈ ఏడాది దేశంలో ఎక్కడచూసినా(ఒక్క నెల్లూరు తప్ప) వానలు విపరీతంగా కురుస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అంతంత మాత్రంగా ఉండే హైదరాబాదు నగరమే ఆతలాకుతలమైపోయింది. వందసంవత్సరాలకొకసారి ఇలాంటి పరిస్థితి వచ్చిందని అక్కడి నేతలు ప్రజలని బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. మన రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంతో పాటు కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలలో కూడా ఇప్పుడు పరిస్థితి దయనీయంగా వుంది, ప్రణాళికా బద్ధంగా నిర్మించబడిన కాకినాడ నగరమే జలమయమయ్యింది, రోడ్లన్నీ నదులయిపోయాయి.

ఇలాంటి వానలు నెల్లూరులోవస్తే ఇంక అంతే సంగతులు, నగరం చెరువైపోతుంది, వీధులు వాగులైపోతాయి. అందులోనూ ఇది కరోనా నామ సంవత్సరం, ఈ ఏడాది మార్చి నెల నుండీ ప్రజలు కష్టాలతోనే కాపురం చేస్తున్నారు, ఇప్పుడు మళ్ళీ ఏ తుఫానో వస్తే కొంప కొల్లేరైపోతుంది. 2015లో నెల్లూరులో మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన చక్రధర్‌బాబే ఇప్పుడు జిల్లా కలెక్టర్‌గా ఉన్నాడు, ఆయనకు నగర పరిస్థితులు బాగా తెలుసు, ఆయన కమిషనర్‌గా ఉన్న కాలంలో భారీ వర్షాలతో నగర జనజీవనం అస్తవ్యస్తమయ్యింది. అప్పట్లో ఆ వరద నీటిని దారి మళ్లించడానికి ఆయన రాత్రింబవళ్లు శ్రమించాడు, చాలా కాలనీల్లో పర్యటించాడు, సమస్య పరిష్కరించడానికి కృషి చేశాడు, నగరంపై ఆయనకి మంచి అవగాహన వుంది, సమస్యను పరిష్కరించడంపై కూడా పట్టుంది, ఇప్పుడు కూడా మునిసిపల్ కార్పొరేషన్‌కి మంచి హుషారైన యువ కమిషనరొచ్చాడు, వీళ్ళిద్దరూ అనుకుంటే నాయకులూ సహకరిస్తారు, రాబోయే వాన మాసానికి(నవంబర్) ఇప్పటినుండే ప్రణాళికలు వేసుకోవాలి, భారీవర్షాలొస్తే నీళ్ళని ఎటునుండి ఎటు దారి మళ్ళించాలో ముందే పథకం రచించుకోవాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందే సంసిద్ధంగా ఉండాలి, ఎక్కువ శాతం వానలొస్తే ఏ ఏ కాలువలు పొంగుతాయో, ఏ ఏ కాలనీలు నిండుతాయో అధికారులకు బాగా తెలుసు, ఎక్కడనుండి నీళ్లను ఎక్కడకు మళ్లిస్తే సమస్యను సులభంగా అధిగ మించవచ్చో కూడా వీళ్ళకి తెలుసు, అందుకే హెచ్చరిస్తున్నాం, అసలే కరోనా నామ సంవత్సరం, ఆపై నవంబరు వస్తోంది... ముందే మేలుకోండి. కష్టాలను అడ్డుకోండి, నష్టాన్ని నివారించండి.

– సంచారి

# కొత్త జేసీ వచ్చారు

జిల్లాకు మరో కొత్త జేసీ వచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ (ఆసరా –సంక్షేమం)గా కొత్తగా జె.శివ శ్రీనివాసులు నియమితులయ్యారు. ఇక్కడ జేసీగా పనిచేస్తున్న కమలకుమారి పదవీ విరమణ చేయడంతో ఆమె స్థానంలో ప్రభుత్వం ఆయన్ను నియమించింది. తాజాగా రాష్ట్రప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 26 మంది డెప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. ఇందులో భాగంగా విజయవాడలోని సిసిఎల్‌ఏ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న శివ శ్రీనివాసులును నెల్లూరు జేసీగా, కడపలోని గాలేరు నగరి సుజలస్రవంతిలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాసులును కావలి ఆర్డీఓగా, కావలి ఆర్డీఓగా పనిచేసిన ఎం.వెంకటసుధాకర్‌ను జిల్లా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ విజిలెన్స్ అధికారిగా, జిల్లా బిసి కార్పొరేషన్ ఇ.డిగా ఉన్న ఎం.చంద్రమోహన్‌ను నంద్యాల తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా, డిఆర్‌డిఏ పి.డిగా నెల్లూరుజిల్లాలో పనిచేస్తున్న వి.కె శీనానాయక్‌ను రంపచోడవరం ఆర్డీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## డిఎస్పీల బదిలీలు :

రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిఎస్పీలను బదిలీ చేస్తూ, పలువురు సిఐలకు డిఎస్పీలుగా ఉద్యోగోన్నతి కలిస్తూ డిజిపి గౌతంసవాంగ్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని దుగరాజపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ సిఐగా పనిచేస్తున్న కె.చెంచురామారావుకు డిఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ సిఐడి విభాగానికి బదిలీ చేశారు. ఎస్‌సి,ఎస్‌టి–1 డిఎస్పీగా పనిచేస్తున్న పి.లక్ష్మీనారాయణను రెగ్యులర్ డిఎస్పీగా నియమించి సిఐడి విభాగానికి బదిలీ చేశారు. సిఐడి డిఎస్పీ ఎన్.రామారావును హెడ్ క్వార్టర్స్‌కు బదిలీచేసి, ఆ స్థానంలో విఆర్‌లో ఉన్న ఎన్.కృష్ణమూర్తి నాయుడును నియమించారు.



## 'ప్రభా'తం

# ఆకలి కేకల..భారతం!

ప్రపంచంలోని అనేక దేశాలను ప్రధానంగా పట్టిపీడిస్తున్న పెద్ద సమస్య ఆకలి సమస్యే!.. అయితే ఆకలితో అల్లాడే దేశాల్లో మనదేశం కూడా ఒకటి కావడం విచారకరం. మనదేశంలో ఇటీవలికాంలో ఎన్నో సంస్కరణలు, మరెన్నో పథకాలు లెక్కలేనన్ని వస్తూనే ఉన్నప్పటికీ పేదరికం మాత్రం తరగడమే లేదు. నిరుపేదల ఆకలి కేకలు తగ్గడమే లేదు. ఇకనైనా ఈ దుస్థితి మారాలి. పేదరికాన్ని జయించేందుకు పథకాలు సిద్ధం కావాలి.



ప్రపంచంలోని అనేక దేశాలను ఎంతోకాలంగా ప్రధానంగా పట్టిపీడిస్తున్న సమస్య ఏదైనా ఉందీ అంటే..అది ఆకలి సమస్యే!..అయితే ఆకలితో అల్లాడే దేశాల్లో మనదేశం కూడా ఒకటి కావడం ఎంతైనా విచారకరం. దేశంలో ఇటీవలికాలంలో ఎన్నో సంస్కరణలు, మరెన్నో పథకాలు లెక్కలేనన్ని వస్తూనే ఉన్నాయి.. కానీ పేదరికం మాత్రం తరగడమే లేదు. నిరుపేదల ఆకలి కేకలు అసలు తగ్గడమే లేదు. ప్రపంచంలోని అనేక వెనుకబడిన దేశాలతో పోలిస్తే మనదేశం బాగా వెనుకబడే ఉండడం ఎంతో దురదృష్టకరం. తాజాగా 107 దేశాల ప్రపంచ ఆకలి సూచీలో మనదేశం 94వ స్థానంలో ఉండడం, ఆకలి సమస్య తీవ్రంగా ఉన్న దేశాల వరుసలో మనం కూడా నిలబడడం మరింత బాధాకరమైన విషయం. దేశంలో శ్రీమంతులకేమీ కొదవ లేకపోయినా, అంతకన్నా భారీగా ఆకలిమంటలు ఆకాశమంత ఎత్తుకు ఎగసిపడుతున్నాయనేది ఎవరూ కాదనలేని సత్యం. ఇరుగుపొరుగున ఉన్న చిన్నచిన్న దేశాలతో పోల్చి చూసుకున్నా అభివృద్ధికి మనం దూరంగా ఎక్కడో ఉన్నాం. నేపాల్, శ్రీలంక, బంగ్లా దేశ్, మయన్మార్, పాకిస్తాన్ వంటి దేశాల కన్నా కూడా మనం ఎంతో వెనుకబడి ఉన్నామని ఇటీవలి అంతర్జాతీయస్థాయి నిపుణుల నివేదికలు చెప్పకనే చెప్తున్నాయి. నానాటికీ దేశంలో దారిద్ర్యం.. నిరుద్యోగం ప్రబలిపోతుండడం, మరోవైపు జనాభా పెరిగిపోతుండడం వంటివి ఇందుకు ప్రధాన కారణాలనుకోవచ్చు. అందులోనూ దారిద్ర్యం అనేది అనేక సమస్యలకు నిలయం. పేదరికం వల్లనే నిరక్షరాస్యత, పోషకాహార లోపం, అభద్రత, ఆకలి చావులు..ఇంకా అనేకానేక సమస్యలు ఒకదానికొకటి లంకె వేసుకుని పుట్టుకొస్తుంటాయి. పేదరిక నిర్మూలన అనేది మనదేశంలో ఎంతో కాలంగా ఒక నినాదంగా మిగులుతోందే తప్ప ఆచరణలో ఆ దుస్థితి మాత్రం మారడమే లేదు.

దేశ జనాభాలో 14 శాతం మంది ప్రజలకు సరైన పౌష్టికాహారం అందడం లేదని, ముఖ్యంగా అయిదేళ్ళ లోపు చిన్నారులు పౌష్టికాహారం లేక బక్కచిక్కిపోతుండడం, సరైన ఎదుగుదల లేక 37.4 శాతం మంది బాలలు బాల్యమంతా బాధలమయంగా ఉంటోందని, 17.3 శాతం మంది చిన్నారుల్లో ఎత్తుకి తగ్గ బరువు ఉండడం లేదని, అయిదేళ్ల లోపు చిన్నారుల్లో 3.7 శాతం మంది మృత్యువాత పడుతున్నారని గణాంకాలు చెప్తున్నాయి. ఇకనైనా ఈ దుస్థితి మారాలి. అందుకు అనువైన కార్యాచరణ పథకాలు సిద్ధం కావాలి. వాస్తవానికి కరోనాకు ముందే మనదేశ ఆర్థిక వ్యవస్థ అంతంతమాత్రంగానే ఉంది. కరోనా దెబ్బతో అది మరింత వెనుకబడిపోయింది. ఉపాధి కరువై పెద్దసంఖ్యలో కార్మికులు, కూలిపనులు చేసుకుని బతికే కష్టజీవులు బతుకుతెరువు కోల్పోయారు. కోట్లాదిమంది వలస కార్మికులు తినడానికి తిండి లేక నేటికీ ఆకలి కేకలతో అల్లాడుతూనే ఉన్నారు. ఈ పరిస్థితులను చక్కదిద్దడానికి, పటిష్టమైన పథకాల అమలుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఆ చర్యలు అమలు ప్రక్రియలు పటిష్టంగా లేకపోవడం, సమర్థవంతమైన పర్యవేక్షణ విధానం కొరవవడం వంటి కారణాలతో పరిస్థితి మళ్ళీ మొదటికొస్తోందని, ఎంతో ముఖ్యమైన పోషకాహార సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు కూడా అరకొరగానే ఉన్నాయని, దేశంలోని పలు పెద్దరాష్ట్రాల విధానాలు ఆకలి కేకలను నిలువరించలేక పోతున్నాయని గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (జిహెచ్ఐ) అంతర్జాతీయ నివేదిక స్పష్టం చేయడం గమనార్హం. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో పౌష్టికాహార లోపం తీవ్రంగా ఉంటోందని, ఆ లోపాలను సరిదిద్దుకుని బాలలకు మంచి ఆహారాన్ని అందించాలని అందరి ఆరోగ్యానికి భరోసా ఉండేవిధంగా పథకాలు రూపుదిద్దుకోవాలని ఆ సంస్థ సూచిస్తోంది.

దేశప్రజలందరికీ ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ అవి ఆశించిన స్థాయిలో ఫలితాలనివ్వకపోవడం వల్లనే మనదేశానికి ఈ దుర్గతి దాపురిస్తోంది. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వైఖరి, పర్యవేక్షణ సక్రమంగా ఉండకపోవడం, గర్భస్థ మహిళలకు పుష్టికరమైన ఆహారం లేకపోవడం, పౌష్టికాహార లోపం అరికట్టేందుకు సమగ్రమైన ప్రణాళికలు లేకపోవడం, జనాభా పెరిగిపోతుండడం వంటి కారణాలే ఈ పరిస్థితికి కారణమని నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు దేశంలో నిరుద్యోగుల సంఖ్య గతంలో కంటే భారీగా పెరిగిపోయి ఇప్పుడు 27 శాతానికి పెరిగిపోవడం, సుమారు 12 కోట్ల మంది దాకా ఉపాధి కోల్పోయి ఆకలితో అల్లాడిపోతుండడం జరుగుతోంది. కేవలం కరోనా వల్ల ఉపాధి కోల్పోయి ఒక్క అసంఘటిత రంగంలోనే సుమారు 40 కోట్ల మందికిపైగా కార్మికులు దుర్భర దారిద్ర్యంలో పడి పోతారని అంతర్జాతీయ కార్మిక సంఘం అంచనా కట్టింది కూడా. అయితే కరోనా కట్టడికి కేంద్రం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ పెట్టి, ఆ తర్వాత దాదాపు 20 లక్షల కోట్ల రూపాయలను ఆర్థిక ఉద్దీపనలుగా ప్రకటించడం వల్ల కొంతమేరకు ప్రజలకు ప్రయోజనం కలిగినా ఉపాధి కల్పన, ఉద్యోగావకాశాల మెరుగుదల, జీడిపి వృద్ధి తదితర అంశాల పట్ల మరింత మేలైన విధానాలతో ముందుకు వెళ్ళాల్సి ఉందని నిపుణుల సంఘాలు సూచిస్తున్నాయి. దేశంలో ఉపాధి పథకాలకు చాలినంత నిధుల కేటాయింపు లేకపోవడం, ఆరోగ్యవ్యవస్థలు అంతంతమాత్రంగానే ఉండడం, ఆర్థికవ్యవస్థ పురోగతి నామమాత్రంగానే ఉండడం, అటు వ్యవసాయపరంగా, ఇటు పరిశ్రమల పరంగా ఆశించినస్థాయిలో అభివృద్ధి లేకపోవడం వంటివి దేశ పురోభివృద్ధికి..ఆర్థికాభ్యున్నతికి ఆటంకాలుగా మారి, అవి చివరికి పేదల జీవితాలకు శాపాలుగా పరిణమిస్తున్నాయి. ఇకనైనా ప్రభుత్వాలు, పాలకులు, అధికారయంత్రాంగం, మేధావులు అందరూ కలసికట్టుగా ఆలోచించి ప్రజలను ఈ కష్టాల నుంచి గట్టెక్కించాలి. ముఖ్యంగా పేదరికం నుంచి ఆకలి బాధల నుంచి విముక్తి చేసేందుకు కృషిచేయాలి. పేదప్రజల సమస్యలను మానవీయ కోణంతో పరిశీలించి పరిష్కరించడం, ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు కృషి చేయడం, ఆహార పథకాలను విస్తరించడం, పేదల ఆర్థికాభ్యున్నతికి అన్నివిధాలా చేయూతనివ్వడం ప్రభుత్వాల కనీసధర్మం. ఆ ధర్మాన్ని చిత్తశుద్ధితో నెరవేర్చాలి. దారిద్ర్యం, ఆకలి, అనారోగ్యం, నిరుద్యోగం.. వీటన్నిటినీ అరికట్టిన నాడే ప్రజలకు మేలు జరుగుతుంది. అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేస్తాయని ఆశిద్దాం!..

ఈ-మెయిల్ ప్రజావాణి

lawyerpatrika@gmail.com

## బాలుగారి విగ్రహానికి టౌన్‌హాలే కరెక్టు

ఒక్క నెల్లూరీయులే కాదు ప్రతి సంగీత అభిమాని గర్వించే భారతీయ గాయకుడు స్వర్గీయ యస్.పి.బాలసుబ్రహ్మణ్యం గారు. ఆయన మహా సంగీతజ్ఞాని. తాను సంగీతంలో ఓనమాలు కూడా నేర్చుకోలేదంటూనే భారతీయ సంగీత సామ్రాజ్యాన్ని ఏలిన మకుటంలేని మహారాజు. ఆయన పాల్గొన్న ఎన్నో కార్యక్రమాలను నేను నెల్లూరు పురమందిరంలో చూశాను. ఆయన పాల్గొన్న ప్రతి సభలోనూ తన 5వ యేట నుండి టౌన్‌హాల్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకునేవాడు.

50 సంవత్సరాల క్రితం వారి నాన్న గారు శ్రీపతి పండితారాధ్యుల సాంబ మూర్తిగారు ప్రారంభించిన భిక్షాటన పూర్వక త్యాగరాజ సంస్మరణోత్సవాలు కూడా ప్రతిఏటా టౌన్‌హాల్‌లోనే జరుగుతాయి, గత 3సంవత్సరాలుగా బాలసుబ్రహ్మణ్యం గారి పుట్టినరోజులకు కూడా టౌన్ హాలునే ఆయన వేదికగా ఎంపిక చేసుకున్నాడు. ఏ ఏడాదికాఏడాది కార్యక్రమ స్థాయి పెరిగి జనం ఎక్కువ స్థాయిలో వస్తున్నారని వేదికను మారుద్దామని కార్యక్రమ నిర్వాహకులు ఆయనను కోరినప్పటికీ ససేమిరా అని టౌన్‌హాల్‌లోనే జరగాలని పట్టు పట్టాడని ఒక సభలో నిర్వాహకులే ప్రకటించారు. ఆయనకున్న స్థాయికి ఆయన కావాలనుకుంటే ఏ మహానగరంలోనైనా ఆయన జన్మదినాన్ని జరుపుకోవచ్చు. కానీ ఆయన ఇచ్చిన "అంతర్జాతీయ బాలసుబ్రహ్మణ్యం అవార్డు" కార్యక్రమానికి తాను పుట్టిన నెల్లూరునీ, అదీ తనకు ఇష్టమైన టౌన్‌హాలునే ఎంపిక చేసుకున్నాడంటే పురమందిరంతో ఆయన బంధం ఎంతగా పెనవేసుకుపోయిందో మనం ఊహించుకోవచ్చు.

వంద సంవత్సరాల చరిత్ర కలిగిన టౌన్‌హాల్‌ను ప్రముఖ వదాన్యులు జె.ఎస్. రెడ్డిగారు సొంత డబ్బులు ఖర్చుపెట్టి ఆధునీకరించిన సందర్భంలో టౌన్‌హాల్‌ని పునఃప్రారంభించింది కూడా బాలుగారే. నిజానికి 2015లో శ్రీ కస్తూరిబా కళాక్షేత్రంలో ప్రతిష్ఠించిన బాలుగారి నాన్న గారైన సాంబమూర్తి గారి విగ్రహాన్ని కూడా టౌన్‌హాల్ ప్రాంగణంలో పెట్టాలని బాలు గారి కోరిక అనికూడా తెలిసింది. అప్పట్లో పురమందిరం కమిటీ అందుకు ఒప్పుకోలేదని అందుకే కళాక్షేత్రంలో పెట్టారని అంటున్నారు. టౌన్‌హాల్ కమిటీ పెద్ద మనసు చేసుకుని బాలుగారి విగ్రహానికి అనుమతి ఇస్తే అదే బాలుగారికి, నెల్లూరు సంగీత ప్రపంచం ఇచ్చే నిజమైన నివాళి అవుతుంది. పురమందిరం ప్రాంగణంలో ఆయన విగ్రహం పెట్టడమే ఆయనకు మనం ఇచ్చే అసలైన గౌరవం.

**యం.వి.ఎస్. శర్మ, హైదరాబాదు.**

## తప్పు చేసినా న్యాయమూర్తులను ప్రశ్నించకూడదా?

భారతీయ రాజ్యాంగ వ్యవస్థలో కోర్టుల పట్ల, న్యాయమూర్తుల పట్ల ప్రజలకి ఎంతో విలువ, గౌరవం ఉన్నాయి. అయితే ఇప్పుడు సాక్షాత్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తిపైనే ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేయడం పెను సంచలనంగా మారింది. కొంతమంది ఇది కోర్టు ధిక్కరణ అని, మరికొంతమంది ఇది అవమానకరమని అహంకార ధోరణి అని కూడా అంటున్నారు. అయితే మరో వర్గం ఇది ధీరత్వానికి సూచిక అని, చట్టం ముందు న్యాయమూర్తులు అతీతులేం కారని, తప్పు ఎవరు చేసినా తప్పేనని, న్యాయవ్యవస్థపై తిరుగుబాటు చేసిన తొలి రాజకీయ నాయకుడిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చరిత్రలో నిలిచిపోతాడని అంటోంది.

ఒక సామాన్య పౌరుడిగా నాకొక సందేహం...? ఇక్కడ జగన్మోహన్‌రెడ్డి తప్పు చేశాడా..? లేక ధైర్యం చేశాడా అన్నది పక్కనపెడితే న్యాయవ్యవస్థలో ఉన్నవారు తప్పు చెయ్యొచ్చా? ఒకవేళ చేసినా వాళ్ళని ఎవరూ ప్రశ్నించకూడదా? ప్రశ్నించకూడదూ అంటే అది ధర్మమేనా? లేదూ ప్రశ్నించవచ్చు అంటే.. మరి జగన్మోహన్‌రెడ్డిలా ఇంతవరకు ఎవరూ ఎందుకు ముందుకు రాలేదు...? న్యాయవ్యవస్థతో పాటు చట్టంలో ఉన్న ఇతర రెండు అధికారిక వ్యవస్థలను ప్రశ్నించే హక్కు సమాజానికి ఉన్నప్పుడు... న్యాయవ్యవస్థని కూడా ఎందుకు ప్రశ్నించకూడదో నాబోటి అల్పుడికి అర్థం కాని విషయం.

**కె.యం.భూషణం, తిరుపతి.**

## ప్రభావితం చేస్తున్న 'ప్రభా'తం

'ప్రభా'తం పేరుతో మీరు రాస్తున్న సంపాదకీయాలు బాగా ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా గతవారం ఆడపిల్లల భద్రతపై రాసింది ఆలోచింపచేసే విధంగా ఉంది. చిన్న సెల్ ఫోను ద్వారా మొత్తం ప్రపంచాన్ని అరచేతిలోకి తీసుకోగలుగుతున్న మనం మహిళల రక్షణ విషయంలో ఎందుకనో వెనుకబడిపోతున్నాం. మహిళలపై దాడులకు పాల్పడిన వారిపైన కొన్ని ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, మహిళలపై దాడులను అడ్డుకోలేకపోతున్నాం. సంఘటన జరిగిన తరువాత స్పందించడానికి ఉపయోగపడే చట్టాలకన్నా, మృగాడిగా మారుతున్న మగాడి నుండి మహిళలు తమను తాము రక్షించు కునేలా శిక్షణా సంస్థలను కూడా ప్రభుత్వం ఏర్పాటుచేసి మహిళలను చైతన్యపరిస్తే బాగుంటుందేమో.

**పుట్టా హరిత, గూడూరు.**

### ప్రభుత్వ బళ్ల స్వరూపం మార్చేసిన

## 'నాడు-నేడు', 'విద్యా కానుక' పథకాలు

ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో ముఖ్యమంత్రి జగన్ తెస్తున్న విప్లవాత్మక మార్పులు పక్క రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. నాడు- నేడు ద్వారా పాఠశాలల స్వరూపాన్ని మార్చివేసి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వాటిని ఆధునీకరించి, విద్యాకానుక ద్వారా చిన్నారులలో నాణ్యమైన విద్యతో బలమైన పునాదికి బీజం పడేలా ప్రోత్సహిస్తున్నాడు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుకు(కొ)నే వాళ్ళు కూడా ఇప్పుడు ప్రభుత్వ బళ్ల వైపు చూస్తున్నారంటే, ఓట్ల రాజకీయాలను పక్కన పెట్టి భావితరాల బంగారు భవిష్యత్తుకు తపిస్తున్న ఈ యువ ముఖ్యమంత్రి అభినందనీయుడు.

**బి.నారాయణరెడ్డి, బెంగళూరు**

లాయర్

పాఠకులకు మనవి

మా(మీ) లాయర్ పత్రికకు

**సమాచారం / లేఖలు**

పంపదలచిన వారు

9866314741 నంబరుకు

వాట్సయాప్ ద్వారా గాని, లేదా

lawyerpatrika@gmail.comకి

ఈ-మెయిల్ ద్వారా గాని

పంపవలసిందిగా విజ్ఞప్తి.

పోస్టల్ చిరునామా :

ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,

మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.

- సం/-

# కోవిడ్ -19 సంక్షోభమైననూ చక్కని ప్రణాళికతో.... 2020 NEET

## మెడికల్‌లో తన ప్రస్థానాన్ని కొనసాగించింది విశ్వసాయి... జాతీయ స్థాయిలో మరోసారి విజేతగా నిలిచింది

## విద్యార్థుల భవితే విశ్వసాయి లక్ష్యం...

కోవిడ్ - 19 పరిస్థితులలోనూ.... పక్కా నిబంధనలను అనుసరిస్తూ.... ప్రస్తుత ఆన్‌లైన్ సాంకేతిక బోధన విధానం ద్వారా సీనియర్ ఫ్యాకల్టీని అందుబాటులో ఉంచి, విద్యార్థులకు ప్రణాళికా బద్ధంగా తర్ఫీదునిస్తూ... డౌట్స్ క్లారిఫై చేస్తూ పరీక్షలకు సిద్ధంచేయించింది. వారిలో మానసిక స్థైర్యం నింపి అత్యుత్తమ ఫలితాలను సాధింపచేసింది విశ్వసాయి.

ALL INDIA MARKS 639
V.VENKATA SAI CHARAN
H.T. No. 1203001824



ALL INDIA MARKS 637
R. DINESH KUMAR
H.T. No. 1203004392

| ALL INDIA MARKS | Name | H.T. No. |
|---|---|---|
| 629 | M.MUNI LAKSHMI | 12030011109 |
| 617 | B.V.MADHAV SAI | 1203002331 |
| 611 | C.NAMRATHA | 1203002521 |
| 610 | B.V.KISHORE | 1203001831 |
| 606 | P.TEJASWI | 1203002471 |
| 605 | T.SIREESHA | 1203001808 |
| 603 | N.SRINIJA | 1203004021 |
| 600 | N.K.KUSHI JAIN | 1203011225 |
| 599 | T.MAMATHA REDDY | 1204002147 |
| 597 | M.V.B.SUDHA | 1203001378 |
| 595 | T.R.KAUSHAL | 1203008288 |
| 592 | P.V.HEMA | 1203008015 |
| 582 | K.PALLAVI REDDY | 1203006231 |
| 578 | K.RAMYA SAI | 1204017255 |
| 577 | JITHENDRA KUMAR | 1203005235 |
| 575 | P.REDDY ABHINAYA | 1204005168 |
| 574 | V.HANVITHA | 1203003654 |
| 573 | T.BHAVANA REDDY | 1203001372 |
| 570 | R.NARASIMHA REDDY | 1203003814 |
| 570 | R.LAKSHMI SIVANI REDDY | 1203001323 |
| 569 | J.SREE LEKHA | 1202002297 |
| 568 | K.SAKETH REDDY | 1203011187 |
| 567 | S.KUMAR GAYATHRI | 1203002241 |
| 566 | P.SAI JAHNAVI | 1203007114 |
| 565 | CH. HANNA SAHITHI | 1204017108 |
| 565 | D.SAI SAMHITHA | 1203007074 |
| 563 | M.PURUSHOTHAM | 1204001435 |
| 562 | SK.KHADAR MASTHAN | 1203006241 |
| 561 | P.JASWANTH | 1203003452 |
| 560 | P.SARANYA | 1203011200 |
| 551 | K.NEELIMA SAI | 1204018221 |
| 551 | R.KRISHIKA | 1203012111 |
| 549 | M.BHAVANA | 1203002090 |
| 546 | P.LAKSHMI SAI | 1203008136 |
| 545 | K.MUNIRAJA | 1203002160 |
| 545 | B.VAMSI KRISHNA | 1203002255 |
| 545 | SK.ABUBAKAR SIDDIQ | 1203011181 |
| 541 | R.SRI SAI GOPIKA | 1203003325 |
| 539 | K.SIVA SAI | 1203002329 |
| 537 | N.SRAVANI | 1203004418 |
| 536 | P.V.AKSHITHA PUJA | 1203008124 |
| 536 | B.SAJI ASRITH | 1203005130 |
| 535 | A.MANASA | 1204009091 |
| 533 | P.SIVA BHAVAN | 1203003245 |
| 531 | P.SRI HARSHITHA | 1203007254 |
| 528 | T.LOKESH | 1203012019 |
| 527 | V.V.N.JAYANTH | 1203008262 |
| 526 | A.RAJEEV AKHIL | 1203010178 |
| 526 | D.SRIKAR REDDY | 1203001278 |
| 524 | B.V.ASHIK KANTH | 1203005231 |

2021 NEET LONG TERM కోచింగ్ క్లాసులు ప్రారంభమైనవి

Classes initially ONLINE and later by DIRECT INTERACTION

అడ్మిషన్ల కొరకు సంప్రదించగలరు

**NELLORE**
Ph: 8886770470,9160670003,8886627820.

**TIRUPATI**
Ph: 9160670004,8886667012,7013,7014.

Dr.N.Satyanarayana & G.Krishna Mohan's

# VISWASAI NEET MEDICAL ACADEMY

NELLORE & TIRUPATI

## దశాబ్దాల కీర్తిని కొనసాగిస్తూ...

# 'నీట్'లో మెరిసిన 'రత్నాలు'

***గత 36 సంవత్సరాలుగా జిల్లా విద్యా ఖ్యాతిని దేశవ్యాప్తం చేస్తున్న రత్నం విద్యాసంస్థలు 2020లో జరిగిన వైద్య శాస్త్ర ప్రవేశ పరీక్షలు 'నీట్'లో కూడా తమ సత్తా చాటాయి. రత్నం మెడికల్ అకాడమీ నెల్లూరు శాఖ నుండి 50 మందికిపైగా తమ విద్యార్థిని విద్యార్థులు యంబిబియస్‌లో సీట్లు సాధించారని రత్నం విద్యా సంస్థల ఛైర్మెన్ రత్నం మాస్టారు చెప్పారు. దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తున్న విజయ పరంపరను కొనసాగించిన విద్యార్థినీ విద్యార్థులకు, బోధనా బోధనేతర సిబ్బందికి రత్నం మాస్టారు కృతజ్ఞతలు తెలిపారు.***



'నీట్'లో ర్యాంకులు సాధించిన జయశ్రీ, వైష్ణవి, అఖిల, రేష్మికిరణ్, గీతికలకు శుభాకాంక్షలు తెలుపుతున్న రత్నం విద్యాసంస్థల ఫౌండర్ ఛైర్మెన్ కె.వి.రత్నం, డాక్టర్ శ్రీనివాసరాజు

జిల్లా విద్యారంగానికి రత్నంసారు దిక్సూచి లాంటివారు. ఆయన శిష్యరికంలో వేలాదిమంది డాక్టర్లుగా ఇంజనీర్లుగానే కాకుండా వివిధ హోదాలలో వివిధ రంగాలలో తమ ప్రతిభను చాటుతూ ప్రపంచం నలుమూలల స్థిరపడి నెల్లూరు కీర్తిని పెంచుతున్నారు. 78యేళ్ళ వయసులో కూడా అలుపెరుగని విద్యా సారధిగా రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్నారు రత్నం సారు. తమ సంస్థ నీట్‌లో ఘన ఫలితాలు సాధించిన సందర్భంగా తమ పూర్వవిద్యార్థి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసరాజుని అతిథిగా పిలిచి వైద్య కళాశాలలో సీట్లు సాధించిన తమ విద్యార్థులను అభినందింపజేశారు రత్నంసారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ, తన జీవితాన్ని రెండు భాగాలుగా విభజించుకుంటానని, రత్నం మాస్టారుని కలవక ముందు – కలిసిన తరువాత అని ఎప్పుడూ విశ్లేషించుకుంటానని చెప్పాడు. మాస్టారు దగ్గర చదువుకోబట్టే ఆయన ఇచ్చిన స్ఫూర్తి, ప్రోత్సాహంతో ఈరోజు తాను ఇంత గొప్ప వైద్యుడిని కాగలిగానని చెప్తూ, ఆయన వద్ద శిష్యరికం చేసిన మీరంతా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని విద్యార్థినీవిద్యార్థులను అభినందించాడు.

ఈ ఏడాది 'నీట్'లో రత్నం మెడికల్ అకాడమీ ఫలితాలు పరిశీలిస్తే... యం.జయశ్రీ 628, ఇ.వైష్ణవి 625, జి.అఖిల 610, సి.హెచ్.రేష్మి కిరణ్ 609, ఐశ్వర్య 607, టి.సిద్ధార్థ్ 607, సి.వి.గీతిక 604, ఎస్.సబేష్ 603 మార్కులతో ఉత్తీర్ణతను సాధించారు. వీరితోపాటు మరో యాభై మందికి యంబిబియస్ సీట్లు లభించాయి.



### రత్నం మాస్టారే... మాకు ఆదర్శం

ఈ సందర్భంగా సీట్లు సాధించిన రేపటి డాక్టర్లు మాట్లాడుతూ, మానసిక ఒత్తిడి లేకుండా విద్యా బోధనలో రత్నం మాస్టారు తమకు ఆదర్శంగా నిలిచారని, భవిష్యత్తులో ఎంతటి కఠిన పరీక్షలనైనా ఎదుర్కోగలమన్న మనోస్థైర్యం రత్నం సారు స్ఫూర్తితో తమకు వచ్చిందని చెప్పారు. తమను సొంత బిడ్డల్లా చూసుకుని తర్ఫీదునిచ్చిన సిబ్బంది అందరికీ వాళ్ళు ధన్యవాదాలు తెలిపారు. తమను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన తమ గురువులను వారు ఈ సందర్భంగా సత్కరించుకున్నారు. అత్యుత్తమ ఫలితాలతో తమ సంస్థ కీర్తితోపాటు నెల్లూరు ఖ్యాతినికూడా పెంచుతూ సమాజ శ్రేయస్సే పరమావధిగా విద్యా సేద్యం చేస్తున్న రత్నం మాస్టారుకి 'లాయర్' అభినందనలు.

## సేవే కొలమానం..
## ప్రతిభకు బహుమానం

1973 నుండి విద్యా రంగంలో తన సేవలను ప్రారంభించిన రత్నం మాస్టారు ఈ నలభై ఏడు సంవత్సరాలలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు, ప్రైవేటు చెప్పడం మొదలుపెట్టిన 11 సంవత్సరాల తరువాత ఆయన తన పేరునే సంస్థ పేరుగా పెట్టి 'రత్నం కోచింగ్ సెంటర్'ను ప్రారంభించారు. విద్య పూర్తిగా వ్యాపారమైపోతున్న తరుణంలో 2010 నుండి ఆరేళ్లపాటు ఇంటర్మీడియట్ విద్యకు దూరంగా ఉండిపోయారు. అయితే 2016లో సేవా దృక్పథంతో, లాభాపేక్ష లేకుండా అర్హత కలిగిన పేద విద్యార్థులకు మంచి చదువు అందించాలన్న లక్ష్యంతో, తన రెండవ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు.

తమ సంస్థలో గొప్ప విజయాలను సాధించినవారిని తమ ప్రచారం కోసం వాడుకుని పేజీల పేజీల ప్రకటనలు ఇవ్వడానికి స్వస్తి పలికారు, గొప్ప ఫలితాలను సాధించి సంస్థ ప్రతిష్టను ఇనుమడింపచేసిన తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని ఇచ్చి ఉత్సాహపరచడం అలవాటుగా మార్చుకున్నారు.

2016–17లో ఎంసెట్‌లో స్టేట్ ర్యాంక్ సాధించిన హేమలతకి 5లక్షల రూపాయల నజరానా అందించి ఆ బాలికను ప్రోత్సహించారు. 2017–18లో జూనియర్ ఇంటర్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన లక్ష్మీకీర్తికి 3 లక్షల రూపాయలు బహుమతిగా అందచేశారు. 2018–19లో నీట్‌లో 615 మార్కులు సాధించిన తమ విద్యాసంస్థల తొలి విద్యార్థిని చందన సుజితకి లక్ష రూపాయలు కానుకగా అందించి ప్రోత్సహించారు. ఇదే సంప్రదాయంలో భాగంగా 2019–20 సంవత్సరానికి గాను సీట్లు సాధించిన టాప్ 8మందిలో మొదటి ఇద్దరికీ ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున, మిగిలిన 6 మందికి తలా యాభై వేల రూపాయల చొప్పున శ్రీనివాసరాజు చేతులమీదుగా అందచేసి వారిని ప్రోత్సహించారు. సంస్థను నాణ్యమైన విద్యతో నడిపించడమే లక్ష్యంగా, ఓ వైపు లక్షలాది రూపాయల పారితోషికాన్ని బోధనా సిబ్బందికి ఇస్తూనే లాభాపేక్షతో కాకుండా సమాజ శ్రేయస్సే ధ్యేయంగా భావిపౌరులను తీర్చిదిద్దే బాధ్యతను తన భుజాల కెత్తుకున్నారు రత్నం మాస్టారు.




ఉత్తరక్రియలు

మంచితనానికి మారుపేరుగా... పదిమందికి మేలు చేసే మంచివ్యక్తిగా నిలిచారు..
మీరు భౌతికంగా ఈ లోకంలో లేకపోయినా మీ మంచితనం సదా నిలిచిపోతుంది.
మీ ప్రేమ.. అనురాగం.. అభిమానం మాకు గుర్తుంటాయి.

డా॥ బొమ్మిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి గారు
మాజీ ఎంపిపి., మాజీ సర్పంచ్, బియస్ఆర్ హాస్పిటల్, ఆత్మకూరు
తేది. 14.10.2020 బుధవారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : డా॥ ఎ.షకీలా

కుమారుడు - కోడలు
బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి - డా॥ గీతిక

కుమార్తె - అల్లుడు
డా॥ ప్రణవి - రాజేష్

తమ్ముళ్ళు:
డా॥ బొమ్మిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి
బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి
మాజీ ఎమ్మెల్సీ, మాజీ జడ్పీ ఛైర్మెన్

పెద్దకర్మ
తేది. 24.10.2020 శనివారం నెల్లూరుజిల్లా, ఆత్మకూరులోని మా స్వగృహమునందు జరుగును. కావున తెలియజేయడమైనది.

# నెల్లూరు కబుర్లు

## కరోనా కట్టడిలో జిల్లా ఫస్ట్

**- కలెక్టర్ చక్రధర్‌బాబు**



జిల్లాలో అందరి కృషితో కరోనాను నియంత్రించడంతో పాటు బాధితులకు మెరుగైన సేవలందించడంలో జిల్లాకు ఫస్ట్ ర్యాంక్ వచ్చిందని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఈనెల 19న ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రులు మేకపాటి గౌతంరెడ్డి, డా.అనిల్‌కుమార్‌యాద్, ప్రజాప్రతినిధుల సహకారంతో ఇది సాధ్యమైందన్నారు. జేసీలు ప్రభాకర్ రెడ్డి, హరేంద్రప్రసాద్‌లతో పాటు వైద్యులు, వైద్యసిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, మీడియా ప్రతినిధులకు ఈ సందర్భంగా కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు.

### వ్యక్తిగత దూషణలు కాదు..

## రైతుల పక్షాన నిలవండి

**టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, బీద రవిచంద్ర**



ధాన్యం కొనుగోలు విషయంలో మోసపోయిన రైతులను ఆదుకోవడం మీ బాధ్యత.. రైతులకు అండగా నిలవండి..అంతేకానీ వ్యక్తిగత దూషణలు చేయడం వల్ల ప్రయోజనం లేదు అంటూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర హితవు పలికారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధనరెడ్డి గురించి ఆయన ప్రస్తావిస్తూ జడ్పీ ఛైర్మెన్‌గా, రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి హుందాతనాన్ని కోల్పోతున్నారని, ఆయనతో పాటు ఆయన అనుచరులు వాడుతున్న భాష అసభ్యకరంగా ఉందని అన్నారు. ఈనెల 19న ఆయన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ళలో అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని సరిదిద్దండని చెప్పిన మాజీమంత్రి సోమిరెడ్డిపై లేనిపోని విమర్శలు వేయడం సబబు కాదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కోసం సోమిరెడ్డి చేస్తున్న కృషి ప్రజలందరికీ తెలుసునని, యాష్‌పాండ్ విషయంలో ఏ విచారణకైనా సిద్ధమన్నారు. రైతులకు న్యాయం చేయాలని సోమిరెడ్డి అడిగితే ఆయనపై వ్యక్తిగత దూషణలతో డైవర్షన్ రాజకీయాలు వద్దన్నారు. రాజకీయాలకు ఇది మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

## ఎంజిబి గ్రూప్స్ అధినేతకు జాతీయ అవార్డు

నెల్లూరుకు చెందిన ఎంజిబి గ్రూప్స్, ఎంజిబి ఫెసిలిటీమాల్ అధినేత జేఎండి ఎంజి గోపాలకృష్ణ ఈనెల 14న మార్కెటింగ్ ఎక్స్‌లెన్సీ, యంగ్ అచీవర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు. 25 దేశాల్లో గుర్తింపు పొందిన ఏషియా జాతీయ అవార్డు ఆఫ్ మార్కెటింగ్ ఎక్సెలెన్సీ చీఫ్ మార్కెటింగ్ అధికారి ఆయనకు ఈ అవార్డును ప్రకటించారు. గోపాలకృష్ణకు ఈ ప్రతిష్టాత్మక అవార్డు రావడం పట్ల జిల్లాలోని ప్రముఖులు, పలు సంస్థల వారు ఆయనకు తమ అభినందనలు తెలిపారు.

## విఆర్‌ఓల ధర్నాందోళన

రెవెన్యూశాఖలో కీలకపాత్ర పోషిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో విఆర్‌ఓలు ఈనెల 19న నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ధర్నాందోళన నిర్వహించారు. అర్హులైన విఆర్‌ఓలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ తొలగించాలని, కరోనా నేపథ్యంలో మరణించిన విఆర్‌ఓల కుటుంబాలను ఆదుకోవాలని తదితర కోర్కెల సాధనకోసం తాము ఆందోళన నిర్వహించినట్లు విఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, డి.వెంకటరమణయ్య పేర్కొన్నారు.

# పార్కుల్లో సందడి.. ఆటస్థలాల్లో ఆనందం

### - క్రీడాకారులతో కళకళలాడిన స్టేడియం



కరోనా మహమ్మారి దెబ్బతో గత కొద్దికాలం నుంచి మూతపడివున్న పార్కులు, ఆటస్థలాలు తిరిగి తెరవడంతో సందర్శకుల్లో సంతోషం వెల్లువెత్తుతోంది. ఈనెల 18 నుంచి పార్కులు తెరవడంతో నెల్లూరు నగరంలోని పలు పార్కుల్లో సందడి నెలకొంది. నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్ద ఉన్న ఘాట్, పార్కు సందర్శకులతో కళకళలాడాయి. నగరంలోని క్రీడాకారులకు ఆటపట్టుగా ఉన్న ఏసి సుబ్బారెడ్డి స్టేడియం క్రీడాకారుల రాకపోకలతో సందడిగా ఉంది. అటు పార్కుల్లోను, పర్యాటక ప్రాంతాల్లోను, ఇటు స్టేడియంలోనూ అందరూ కోవిడ్ నిబంధనలు పాటిస్తున్నారు. ముఖ్యంగా స్టేడియంకు వచ్చే వారంతా తప్పనిసరిగా మాస్కు ధరించాలని, శానిటైజర్లను వినియోగించాలని, భౌతిక దూరం పాటించాలని, క్రీడాకారులు ప్రత్యేక ప్రణాళికతో క్రీడలను సాధన చేయాలని అధికారులు సూచించారు. ఉదయం 5.30 నుంచి 8.30 గంటల దాకా, ఆ తర్వాత సాయంత్రం 4 నుంచి 7 గంటల దాకా స్టేడియంను వినియోగించుకోవచ్చన్నారు. 60 ఏళ్ళ పైబడిన వారికి, పదేళ్ళ లోపు పిల్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలి

**ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పిసిసి నేత శైలజానాథ్**



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని పిసిసి నేత శైలజానాథ్ పిలుపునిచ్చారు. ఈనెల 18న నెల్లూరు నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యవర్గసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో త్వరలో ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. విద్యార్థి సంఘాలు ప్రజా ఉద్యమాలతో ముందుకు సాగాలన్నారు. వైకాపా, భాజపా, తెదేపా కుట్ర రాజకీయాలకు చరమగీతం పాడాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాపథకాల్లో విద్యార్థులకు అన్యాయం జరక్కుండా ఎన్ఎస్‌యుఐ నిరంతరం పరిశీలిస్తుండాలన్నారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు కరిముల్లా, రాష్ట్ర అధ్యక్షుడు నాగ మధుయాదవ్‌ల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. నాయకులు ఎం.మోహన్‌రావు, ఏటూరి శ్రీనివాసులురెడ్డి, అనిల్‌కుమార్, బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుపార్టీ ఏర్పడి.. వందేళ్ళు

**--- ఘనంగా శత ఆవిర్భావ దినోత్సవం ---**

భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 17న నెల్లూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1920 అక్టోబర్ 17న దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని, కార్మికులు, కర్షకులు, పేదల పక్షాన ఎర్రజెండా నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కష్టజీవులకు అండగా ఉంటూ తమ పార్టీ సమసమాజ స్థాపనకు కృషిచేస్తోందన్నారు. దేశంలో బిజెపి పాలనలో మహిళలకు, దళితులకు రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కిన్నెరకుమార్, పులిగండ్ల శ్రీరాములు, మూలం రమేష్, పొట్టేపాళెంలో చంద్రమౌళి తదితరుల ఆధ్వర్యంలో పార్టీ శత ఆవిర్భావ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి.

## మాస్కు లేకుండా బస్సుల్లోకి అనుమతించవద్దు

కోవిడ్‌ను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు ప్రభుత్వం పేర్కొన్న నిబంధనలను బస్సుల్లో తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారి(డిటిసి) సుబ్బారావు పేర్కొన్నారు. ఈనెల 17న ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని టూరిస్ట్ బస్సులు, టౌన్‌బస్సులు, విద్యాసంస్థల బస్సులు, మ్యాక్సీ క్యాబ్ యజమానులు ప్రామాణిక కార్యాచరణ పద్ధతిని పాటించాలని స్పష్టం చేశారు. బస్సు ఎక్కే ప్రదేశాల్లో 'నో మాస్క్–నో ఎంట్రీ' బోర్డులను ఏర్పాటు చేయాలని, మాస్కులు తప్పకుండా పెట్టుకోవాలని, సామాజిక దూరం పాటించాలని, చేతులు తరచూ శుభ్రపరచుకోవడంపై పోస్టర్లను బస్సుల్లోపల ఏర్పాటుచేయాలని ఆయన సూచించారు.

## డిసిహెచ్‌గా డాక్టర్ ప్రభావతి

జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త (డిసిహెచ్)గా డాక్టర్ ప్రభావతిని నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్ సింఘాల్ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. డాక్టర్ ప్రభావతి తెలంగాణలో సివిల్ సర్జన్‌గా పనిచేసిన ఆంధ్రా కేడర్‌కు చెందిన వైద్యురాలు. తెలంగాణలో 58 ఏళ్ళకే రిటైరైనా, ఆంధ్రలో 60 ఏళ్ళ వరకూ విధులు నిర్వహించే అవకాశం ఉండడంతో ఆమె అభ్యర్థన మేరకు ఆమెను ఏపిలో విధుల్లోకి తీసుకుంటూ నెల్లూరు జిల్లా డిసిహెచ్‌గా నియమించినట్లు సమాచారం.

## కైలాసరథం ప్రారంభం

నెల్లూరులోని పాండురంగ అన్నదాన సమాజం అనుబంధ సంస్థ పార్థివ శరీర వసతి నిలయం నేతృత్వంలో అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట సూర్య నారాయణ ఆధ్వర్యంలో ఈనెల 18న కైలాసరథాన్ని ప్రారంభించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పాండురంగ అన్నదాన సమాజం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్‌తో పాటు కమిటీ సభ్యులు, దాతలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### అగ్రవర్ణ పేదలకు

## రిజర్వేషన్లు ఇవ్వాలి

అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు అమలుచేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ ఈనెల 19న డిఆర్‌ఓ వెంకటరమణకు వినతిపత్రం సమర్పించారు. కేంద్రప్రభుత్వం ఇందుకోసం చట్టం కూడా చేసిందని, పేద వర్గాల విద్యాప్రవేశాల కోసం ఈ చట్టం అమలులోకి వచ్చిందని, రాష్ట్రప్రభుత్వం దీని ప్రకారం వారికి రిజర్వేషన్లు అమలుచేయాలని ఆయన కోరారు.

### పినాకిని ఎక్స్‌ప్రెస్

## రైలును నడపాలి

జిల్లా ప్రజలకు, చిరు వ్యాపారులకు ఎంతో అనుకూలమైన పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలును తిరిగి పట్టాలెక్కించాలని, కరోనా నేపథ్యంలో రద్దు చేసిన ఆ రైలును మళ్ళీ నడపాలని జిల్లా రోటరీ అధ్యక్షుడు, రైల్వే యూజర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీ నారాయణ ఈనెల 19న ఒక ప్రకటనలో కోరారు.

### సీఎం జగన్‌కు బిసి నాయకుని

## కృతజ్ఞతలు

రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి కార్పొరేషన్లను ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ ఉల్లిపాయల మురళీకృష్ణ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 18న నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయడం సంతోషకరమని, బీసీలు ఎల్లవేళలా వైకాపాకు అండగా ఉంటారని పేర్కొన్నారు.

### బహుజన ఉపాధ్యాయ సంఘం

## కొత్త కార్యవర్గం

జిల్లా బహుజన ఉపాధ్యాయ సంఘం (బిటిఏ) నూతన కార్యవర్గాన్ని ఈనెల 18న ఎన్నుకున్నారు. నెల్లూరు దర్గామిట్ట ఎంపియుపి స్కూల్లో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా డిఎల్ రాజు, గౌరవాధ్యక్షునిగా కృపాకర్, అసోసియేట్ అధ్యక్షునిగా కృష్ణయ్య, ఆడిటర్‌గా వెంకటరమణమూర్తి, కోశాధికారిగా తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా రఘు, అదనపు ప్రధాన కార్యదర్శిగా చంద్రమౌళి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జయకుమార్, హజరత్తయ్య, శంకరయ్య, రమేష్‌బాబు, చెంచయ్య, మోహన్ ఎన్నిక కాగా, కార్యదర్శులుగా మస్తాన్, రంగయ్య, నాగేంద్రరావు, ఏసయ్య తదితరులు ఎన్నికయ్యారు. బిటిఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లం వేణుగోపాల్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.



## ఆరోగ్యశ్రీ క్యాలెండర్ ఆవిష్కరణ

డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ క్యాలెండర్‌ను ఈనెల 20న జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, జేసీ హరేంధిరప్రసాద్, జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ఆవిష్కరించారు. నెల్లూరు నగరంలోని జడ్పీ ఆవరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ క్యాలెండర్‌లో ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల వివరాలు, వాటి ఫోన్ నెంబర్లు ఉన్నాయని, ప్రజలందరూ ఈ సమాచారాన్ని వినియోగించుకోవాలన్నారు. గ్రామ-వార్డు సచివాలయాల్లో కూడా వీటిని ప్రదర్శించేలా ఏర్పాటుచేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ రాష్ట్ర జెఇఒ డాక్టర్ నాగార్జున, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 60 వేలు దాటిన కరోనా కేసులు

జిల్లాలో కరోనా కేసుల సంఖ్య ఈనెల 21వ తేది నాటికి 60,108కి చేరుకుంది. 21వ తేదీన 3,167 మందికి పరీక్షలు చేయగా 116 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. ఇప్పటిదాకా జిల్లాలో ఈ వ్యాధి నుంచి కోలుకున్న 57,411 మంది ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. 2136 మంది చికిత్సలు పొందుతున్నారు. కాగా ఈ మహమ్మారి వ్యాధితో ఇప్పటికి జిల్లాలో 561 మంది ప్రాణాలు కోల్పోయారు. కరోనా పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కేసులు తగ్గుతున్నప్పటికీ ప్రమాదం ఇంకా పొంచి ఉందని, తప్పని సరిగా భౌతిక దూరం, శానిటైజర్, మాస్కులు ధరించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### ఫోన్ చేసిన 20 నిమిషాల్లోపే..

## అత్యవసర వైద్యసేవలకు వాహనాలు

**ఆరోగ్యశ్రీ అడిషనల్ సిఇఒ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి**

ఫోన్ చేసిన 20 నిమిషాలోపే బాధితుల వద్దకు 108, 104 వాహనాలు వెళ్ళేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ రాష్ట్ర అడిషనల్ సిఇఒ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన జిల్లాలో 108, 104 వాహనాల ద్వారా అందుతున్న సేవలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెంకటాచలం, అల్లూరు, కోవూరు తదితర ప్రాంతాల్లో వాహనసేవలు ఎలా ఉన్నాయో ఆరాతీశారు. ప్రమాదాల్లో ఉన్నవారిని, అత్యవసర వైద్యచికిత్సలు అవసరమైనవారిని వైద్యశాలలకు చేర్చేందుకు ఈ వాహనాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని, జిల్లాలో ఈ వాహనసేవలు బాగున్నాయంటూ ఆయన ఈ సందర్భంగా సంతృప్తిచేశారు.

### రైతు వ్యతిరేక విధానాలను

## నిరసించాలి

**- వడ్డే శోభనాద్రీశ్వరరావు**

కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు రూపొంది స్తున్న వ్యవసాయ చట్టాలు, అవలంభిస్తున్న విధానాలు రైతులకు వ్యతిరేకంగా ఉన్నా యని, వాటిని నిరసిస్తూ రైతులు పోరా టాలకు సిద్ధం కావాలని రాష్ట్ర రైతు పోరాట సమన్వయ సమితి కన్వీనర్, వ్యవసాయశాఖ మాజీమంత్రి వడ్డే శోభ నాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు.

ఇటీవల ఆయన నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానభవన్‌లో జరిగిన అఖిల పక్ష రైతు సదస్సులో మాట్లాడుతూ రైతు లను అధోగతిపాలు చేసేలా ప్రభుత్వాలు ప్రవర్తిస్తున్నాయంటూ విమర్శించారు. అసలే రైతులు పండించిన పంటలకు తగు గిట్టుబాటు ధరలు లేక నష్టాలపాలవుతు న్నారని, రాను రాను వ్యవసాయం రైతులకు పెనుభారంగా పరిణమిస్తోందన్నారు. ఆలిండియా కిసాన్‌సభ జాతీయ ఉపాధ్య క్షుడు రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు నరసింహారావు, నాయకులు హరనాథ్, పి.జమలయ్య, కోటిరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

### ఏయు పీజీసెట్ ఫలితాల్లో

## జిల్లాకు ర్యాంకులు

ఆంధ్రా యూనివర్సిటీ పీజీ సెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపుతూ మంచి ర్యాంకులు సాధించారు. లైఫ్‌సైన్స్ విభాగంలో రాపూరుకు చెందిన లెక్కల హరిప్రియ ఓపెన్ కేటగిరీలో 60 మార్కులు సాధించి 4వ ర్యాంకును సాధించగా, కెమికల్ సైన్సెస్ విభాగంలో నెల్లూరులోని అరవిందనగర్‌కు చెందిన పి.వంశీ 78మార్కులతో బీసి కేటగిరీలో 5వ ర్యాంకు సాధించడం విశేషం. ఉత్తమ ర్యాంకులు సాధించిన ఆ విద్యా ర్థులను అందరూ అభినందిస్తున్నారు.

### పరిశ్రమల్లో...

## స్థానికులకు ఉద్యోగాలివ్వండి

**సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి**



పరిశ్రమల యాజమాన్యాల వారు స్థానికులకు తమ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని వైకాపా నాయకుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఈనెల 19న ఆయన వెంకటాచలంలోని సరస్వతినగర్ వద్ద నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొని మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కృష్ణపట్నం పోర్టు నిర్మించడంతో పాటు పోర్టు ఆధారిత పరిశ్రమలను కూడా ఏర్పాటుచేశారని ఆయన గుర్తుచేశారు. అపాచీ పరిశ్రమతో పాటు అనేక స్పెషల్ ఎకనామిక్ జోన్స్ (ఎస్ఇజడ్)లను ఏర్పాటుచేసి జిల్లా పారిశ్రామికాభివృద్ధికి డా. వైయస్ఆర్ ఎంతగానో కృషిచేశారన్నారు. కాగా, ఈ జాబ్‌మేళాకు 304 మంది హాజరు కాగా, 243 మంది ఎంపికయ్యారు. జిల్లా ఉపాధి మేనేజర్ హైమవతి, ఎంపిడిఓ సరళ, డిఆర్‌డిఏ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌తో పాటు పలు కంపెనీల ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం భద్రతకు ఇక దిగుల్లేదు

### 71 కోట్లతో 204 కొత్త గోడౌన్ల నిర్మాణాలు

జిల్లాలో ఇటీవల ఎడగారు వరి పండించుకున్న రైతులు ధాన్యాన్ని భద్ర పరచుకునేందుకు గోడౌన్లు అందుబాటులో లేక ఎన్నో అవస్థలు పడ్డారు. ధాన్యం విక్రయాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్న సమయంలోనే వానలు రావడంతో ధాన్యం తడిసిపోయి నాణ్యత కోల్పోతున్న నేపథ్యంలో ఇక అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా రాష్ట్రప్రభుత్వం జిల్లాలో రైతులు ధాన్యం భద్రపరుచుకు నేందుకు వీలుగా పెద్దఎత్తున గోడౌన్ల నిర్మాణాలకు సంకల్పించింది. సుమారు 71 కోట్ల రూపాయల వ్యయంతో జిల్లాలో కొత్తగా 204 గోడౌన్లను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండడంతో జిల్లా రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 63 గోదాములున్నాయి. వీటిలో 45 వేల మెట్రిక్ టన్నుల దాకా ధాన్యం నిల్వ చేసుకునే వీలుంది. తాజాగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాలద్వారా జిల్లాలో 204 ప్రాంతాల్లో కొత్త గోడౌన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా వీటిని నిర్మించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తొలివిడతగా ఇందులో 117 గోడౌన్లను అందుబాటులోకి తెచ్చేందుకు సంబంధిత అధికారులు ముమ్మరంగా కృషి చేస్తున్నారు. రానున్న రబీ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ గోడౌన్ల నిర్మాణాలను త్వరితగతిన నిర్మించేందుకు సమాయత్తమయ్యారు.

## జిల్లాలో జోరు వానలు

గత నాలుగురోజులుగా జిల్లాలోని అన్ని మండలాల్లో వానలు కురుస్తున్నాయి. కొన్నిచోట్ల భారీగా, మరికొన్ని ప్రాంతాల్లో స్వల్పంగా కురుస్తున్న వానలతో రోడ్లు జలమయమయ్యాయి. కాలువలు నిండి ప్రవహిస్తున్నాయి. నెల్లూరు నగరంలోనూ, చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ గత నాలుగైదురోజులుగా బాగా ముసురుపట్టి వానజల్లులు కురుస్తున్నాయి. నెల్లూరులో రోడ్లు సక్రమంగా లేకపోవడంతో అనేకచోట్ల వాన నీళ్ళు నిలిచి మురుగు మడుగులుగా తయారయ్యాయి.

## 27 వరకు రేషన్ పంపిణీ

జిల్లాలోని 9,29,000 బియ్యం కార్డులకు ఈనెల 20 నుంచి 27వ తేది వరకు రేషన్ సరుకుల పంపిణీ జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బాలక్రిష్ణా రావు ఈనెల 19న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా కార్డులోని ఒక్కో సభ్యునికి 5కిలోల బియ్యం, ఒక్కో కార్డుదారుకు 5కిలోల వంతున శనగలు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. కోవిడ్ నేపథ్యంలో నిబంధనలు పాటిస్తూ కార్డుదారులు సరుకులు పొందాలని ఆయన సూచించారు.

## రబీ సాగుకు.. రెడీ

జిల్లాలో రానున్న రబీ సీజన్‌కు పంటలు వేసుకునేందుకు రైతన్నలు సమాయత్తం అవుతుండగా, అందుకు తగ్గట్టుగా వ్యవసాయ శాఖ కూడా రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు సిద్ధమవుతోంది. రబీ సీజన్‌లో జిల్లాలో సుమారు 2 లక్షలా 44వేల హెక్టార్లలో పంటలు సాగుచేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రధానంగా 2 లక్షలా 15వేల హెక్టార్ల దాకా వరి సాగు జరుగుతుందని, మినుము పంట 16వేల హెక్టార్లలోను, శనగలు 11 వేల హెక్టార్లలోనూ సాగుచేస్తారని భావిస్తున్నారు. అదేవిధంగా వేరుశనగ పంట 3850 హెక్టార్లు, నువ్వులతో పాటు ఇంకా జొన్న, సజ్జ, పెసర, రాగి, మొక్కజొన్న, పొగాకు తదితర పంటలు వేసేందుకు రైతులు సిద్ధం అవుతుండగా రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేసేందుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

**• విధి నిర్దయకు.. ఇదో నిదర్శనం**

# మృత్యువై విరుచుకుపడ్డ విద్యుత్‌తీగ

- ఒకర్ని కాపాడబోయి మరొకరుగా.. ఏకంగా ముగ్గురు మృత్యువాత
- దుర్మరణం చెందిన కొడుకు, తల్లి, భార్య • హౌసింగ్‌బోర్డులో ఘటన



*మృత్యువు ఎక్కడ పొంచివుంటుందో.. ఏ రూపంలో వచ్చి ఎవర్ని బలితీసుకుం టుందో చెప్పలేం. అందుకే విధి ఎంతో బలీయమైనదని, కర్కశమైనదని అంటారు. విసురుగా వీస్తున్న గాలులకు 11 కేవీలైన్ విద్యుత్‌తీగ యమపాశంలా వచ్చి పైనబడింది. దీంతో ఒకరి తర్వాత ఒకరుగా ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటనతో నెల్లూరు రూరల్ పరిధిలోని కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ అవాక్కయిపోయింది. ఇటీవల జరిగిన ఈ దురదృష్టకర సంఘటన ఇక్కడి ప్రజలందరినీ కంటతడి పెట్టించింది.*

కొరియర్‌లో ఏదో పార్శిల్ వచ్చిందని తీసుకుంటూ ఉంటే ఇంటిపైనున్న 11కేవీ విద్యుత్‌తీగ తెగి కొరియర్‌బాయ్ తలపై పడడం.. ఆయనకు టోపీ ఉండడంతో జారిపోయి కొరియర్ తీసుకుంటున్న గోవిందు వేణుగోపాల్(55) అనే ఉపాధ్యా యుడి మీదపడడం క్షణాల్లో జరిగిపో యాయి. వేణుగోపాల్ షాక్‌కు గురికావ డాన్ని గమనించిన తల్లి బుజ్జమ్మ(75) ఒక్క ఉదుటున వచ్చి కుమారుడిని కాపాడబోయి ఆమె కూడా షాక్‌కు గురైంది. వేణుగోపాల్ భార్య హేమలత అలియాస్ మరియమ్మ (50) కర్ర తీసుకుని వచ్చి ఆ విద్యుత్ వైరును తొలగిస్తుండగా ఆ తీగ తాకి ఆమె కూడా విద్యుత్‌ఘాతానికి గురై పడి పోయింది. ఈ దుర్ఘటనలో ముగ్గురూ ప్రాణాలు కోల్పోవడంతో ఆ ప్రాంతంలోని ప్రజలంతా నిర్ఘాంతపోయారు.

చుట్టుపక్కల వారితో ఎంతో బాగున్న ఆ ముగ్గురూ.. కొద్దినిమిషాల్లోనే హఠా త్తుగా మరణించడంతో ఆ ప్రాంతవాసులు కన్నీరుమున్నీరయ్యారు. కొరియర్ బాయ్ మాత్రం ఈ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. మరణించిన వేణు గోపాల్ కుమారునికి ఇటీవలే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. కుమార్తె అనంతపురంలో పరీక్ష రాసేం దుకు వెళ్ళింది. కాగా, వేణుగోపాల్ సైదాపురం మండలంలోని కలిచేడు పాఠ శాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. జనవిజ్ఞాన వేదికలో చురుకైన పాత్ర పోషిస్తూ, క్రమశిక్షణతో ఉండే ఉపాధ్యా యునిగా ఆయనకెంతో మంచిపేరు ఉంది. మృత్యువు ఇంత నిర్దయగా ముగ్గురి ప్రాణా లను కబళించడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన చెందారు. విగతజీవులైన తల్లిదండ్రుల మృతదేహాలను చూసి వారి బిడ్డలిద్దరూ పెద్దగా రోదిస్తున్న దృశ్యం ప్రజలను కలచివేసింది.

# బీసీలకు పట్టాభిషేకం

- చెప్పిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్
- దేశంలోనే కనీవినీ ఎరుగని విధంగా 56 బీసీ కార్పొరేషన్లకు పాలక మండళ్ళు

మడమ తిప్పని, మాట తప్పని యువనేత వైయస్ జగన్ మరోసారి తాను చెప్పినమాటను నిలబెట్టుకుని అందరి ప్రశంసలందుకుంటున్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఏలూరులో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించినట్లుగానే ప్రతి సామాజికవర్గానికి సమన్యాయం చేయాలనే సంకల్పంతో బీసీలకు పెద్దపీట వేశారు. రాష్ట్రంలో మరిన్ని కార్పొరేషన్లు ఏర్పాటుచేసి బలహీనవర్గాలకు సమున్నత స్థానం కల్పిస్తూ బీసీల అభ్యున్నతికి అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నారు. ఇది ఒక్క మన రాష్ట్రంలోనే కాదు, దేశచరిత్రలోనే కనీవినీ ఎరుగని విషయం. రాష్ట్రంలో **56** బిసి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ప్రతి బీసీ కార్పొరేషన్‌కు ఛైర్మెన్‌తో పాటు **12** మంది డైరెక్టర్లను కూడా నియమించి బీసీల ప్రగతికి బంగారుబాటలు వేయడం ఎంతో హర్షణీయం..చరిత్రాత్మకం కూడా.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నెల్లూరుకు చెందిన నాలుగు బీసీ కార్పొరేషన్ల ఛైర్మెన్లు

రాష్ట్రంలోని బలహీనవర్గాల సంక్షేమం కోసం, బీసీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ సారథ్యంలోని రాష్ట్రప్రభుత్వం పెద్దఎత్తున కార్యాచరణ మొదలుపెట్టింది. ఈనెల 18న రాష్ట్రంలో 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వాటికి డైరెక్టర్లను కూడా నియమించడం పట్ల బలహీనవర్గాల ప్రజల్లో ఆనందం వెల్లువెత్తింది. మొత్తం 139 బీసీ కులాలకు సంబంధించి 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేయడం రాష్ట్రంలోనే చరిత్రాత్మకమైన చర్యగా బీసీలు అభివర్ణిస్తున్నారు.

ఇప్పటికే బీసీల సంక్షేమం కోసం 16 నెలల్లో 33,500 కోట్ల రూపాయలను వ్యయం చేసిన ప్రభుత్వం తాజాగా బీసీ కార్పొరేషన్‌ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేయడం విశేషం. ఇందులో మహిళలకు 50 శాతానికి పైగానే ప్రాతినిధ్యం కల్పించడం పట్ల బీసీ మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్పొరేషన్లు కులసంఘాల కంటే ఎక్కువగానే ఆయా కులాల సంక్షేమం కోసం పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

### బీసీలకు ఎనలేని గౌరవం :

ఈ పాలకమండళ్ళు ఆయా కులాల ప్రజలకు జవాబుదారీగా ఉంటాయని, వీటి ద్వారా బీసీ కులాలకు ప్రభుత్వంలో ఎంతో గౌరవం కల్పించినట్లయిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్లకు ఛైర్మెన్లను ప్రకటించిన అనంతరం తాడేపల్లిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పలువురు వైకాపా నాయకులు మాట్లాడుతూ బీసీలు రాష్ట్ర ప్రగతికి వెన్నెముక వంటివారని, వారిని సమున్నతస్థాయిలో గౌరవించడం ద్వారా ముఖ్యమంత్రి తన నిజాయితీని నిరూపించుకున్నారని అన్నారు. గత ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటుబ్యాంకులుగానే చూశాయని, ఇప్పుడు వైయస్సార్సీపి ప్రభుత్వం బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు బాటలు వేసిందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు డా.పి.అనిల్‌కుమార్, బొత్స సత్యనారాయణ, ఎం.శంకర్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నెల్లూరుజిల్లాకు నాలుగు కార్పొరేషన్ ఛైర్మెన్ల పదవులు :

రాష్ట్రస్థాయిలో బీసీ కార్పొరేషన్‌ల ఛైర్మెన్లలో నాలుగు పదవులు నెల్లూరుజిల్లాకు కేటాయించడం, ఇందులో రెండింటిని మహిళలకు ఇవ్వడం పట్ల బీసీ వర్గాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. మరో 40 డైరెక్టర్ల పదవులు కూడా జిల్లాకు దక్కనున్నట్లు సమాచారం. జిల్లాలో నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మెన్‌గా కర్ణా నారాయణ ముదిరాజ్, జంగం కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా వలివేటి ప్రసన్న, ముస్లిం సంచారజాతుల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా సయ్యద్ ఆసీఫా, కోవూరు నియోజకవర్గం నుంచి బొందిలి కార్పొరేషన్ ఛైర్మెన్‌గా కిశోర్‌సింగ్‌లను నియమిస్తూ ప్రభుత్వం ప్రకటించడంతో ఆయా వర్గాల ప్రజల నుంచి సంతోషం వెల్లువెత్తుతోంది.

ఏదేమైనా బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్న రాష్ట్రముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి బీసీలంతా కృతజ్ఞతలు చెప్తూ ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బీసీలకు గతంలో ఎప్పుడూ లేనంతగా ఇప్పుడు వైకాపా పాలనలో ఇంతగా ప్రాధాన్యత రావడం పట్ల బీసీలు ఈ కార్యక్రమాన్ని ఒక పండుగలా వేడుక జరుపుకుంటున్నారు.

### బీసీల అభివృద్ధికి కృషి చేస్తాం

– కొత్త ఛైర్మెన్‌లు, ఛైర్‌పర్సన్‌లు

బీసీల అభివృద్ధికి కృషి చేస్తామని కొత్తగా నియమితులైన ముదిరాజ్, బొందిలి, ముస్లిం సంచార జాతులు, జంగం కార్పొరేషన్ల ఛైర్మెన్లు నారాయణ, కిషోర్‌సింగ్, ఆసీఫా, ప్రసన్న తెలిపారు. ఈనెల 19న నెల్లూరులోని వైయస్సార్సీపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్పొరేషన్ల ద్వారా కులాల వారీగా బీసీల అభ్యున్నతికి పాటుపడతామన్నారు. తమను గౌరవించి పదవులు ఇచ్చిన ముఖ్యమంత్రికి, ఇతర నేతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జ్యోతీరావు పూలే విగ్రహానికి పాలాభి షేకం చేసి నివాళులర్పించారు.

# మన సతీష్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్



మన నెల్లూరీయుడు, దేశ రక్షణ రంగంలో అద్భుతాలు సృష్టిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్న శాస్త్రవేత్త, నెల్లూరు ముద్దుబిడ్డ..భారత రక్షణ, పరిశోధన సంస్థ (డిఆర్‌డిఓ) ఛైర్మెన్‌గా గుండ్రా సతీష్‌రెడ్డికి మరో అరుదైన గౌరవం లభించింది. ఈనెల 17న హైదరాబాద్‌లో జరిగిన జెఎన్‌టియు స్నాతకోత్సవంలో ఆ యూనివర్శిటీ పూర్వ విద్యార్థి అయిన మన సతీష్‌రెడ్డి గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందుకోవడం ఎంతైనా విశేషం. యూనివర్శిటీ ఇన్‌చార్జి వీసీ జయేశ్ రంజన్ చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందరరాజన్ ఈ సందర్భంగా సతీష్‌రెడ్డికి శుభాకాంక్షలు అందజేసి, దేశ రక్షణరంగానికి మన సతీష్‌రెడ్డి అందజేస్తున్న విశిష్టసేవలను కొనియాడారు. అనంతరం సతీష్‌రెడ్డి మాట్లాడుతూ తాను చదువుకున్న ఈ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని, దేశ రక్షణ రంగంలో యువతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, దేశీయంగా సాంకేతితకను మెరుగుపరచేందుకు విద్యా పరిశోధన సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందుకోసం ప్రస్తుతం 3500 మందికి శిక్షణ ఇస్తుండగా వచ్చే ఏడాదికి 5వేల మందికి ఆ అవకాశం కల్పించనున్నామని, ఇందుకు సుమారు వెయ్యికోట్ల రూపాయల దాకా వెచ్చించడం జరుగుతుందని చెప్పారు. కాగా, మన సతీష్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల జిల్లా ప్రజలు, ఆయన కుటుంబసభ్యులు, మిత్రులు, సహచరులు అందరూ ఎంతగానో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



"ఏ.పి. విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్" డైరెక్టర్‌గా తాను నియమింపబడడానికి సహకరించిన రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీమతి టి.దివిజ

# పక్షుల కిలకిలారావాలతో.. పులకింత

## ---- పులికాట్, నేలపట్టుల్లో సందడే సందడి ----



రంగురంగుల పక్షుల కిలకిలారావాలతో సూళ్ళూరుపేట సమీపంలోని పులికాట్, నేలపట్టు తదితర ప్రాంతాలు పులకించిపోతున్నాయి. ఈ ప్రాంతాలకు ప్రతిఏటా ఈ సీజన్‌లో గుంపులుగుంపులుగా విదేశీ విహంగాలు రావడం ఎంతో కాలం నుంచి జరుగుతున్నదే. గత కొద్దిరోజులుగా వీటి రాక ప్రారంభం కావడంతో ఈ ప్రాంతాలన్నీ పక్షుల సందడితో ఆహ్లాదకరంగా ఉన్నాయి. అందులోనూ ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో పులికాట్ సరస్సు నేలపట్టు చెరువుల్లో నీళ్ళు పుష్కలంగా ఉండడంతో పక్షులకు ఆహారానికి ఎలాంటి కొదవ లేదు. దీంతో ఇప్పటికే పెద్దసంఖ్యలో ఫ్లెమింగో పక్షులు, ఫెలికాన్‌లు రకరకాల బాతుజాతి పక్షులు వేలసంఖ్యలో ఇక్కడికి వచ్చేస్తున్నాయి. పులికాట్, నేలపట్టు తదితర ప్రాంతాల్లో ఉన్న మడచెట్లను ఆవాసంగా చేసుకున్న ఈ వలస పక్షులు ఇక్కడే కొద్దికాలం ఉండి, గుడ్లుపెట్టి, పిల్లలను పొదిగి, రెక్కలు వచ్చాక ఆ పిల్లలతోసహా తిరిగి తమ స్వస్థలాలకు ఎగిరి వెళ్లిపోతుంటాయి. పక్షులకు అవసరమైన ఆహారం కొరత లేకుండా ఇక్కడ లభిస్తుండడంతో పులికాట్, నేలపట్టు తదితర ప్రాంతాల్లో విడిదికి ప్రతిఏటా పెద్దసంఖ్యలో విదేశీ పక్షులు వస్తుంటాయి. అందచందాల ఈ పక్షులను తిలకించేందుకు పెద్దసంఖ్యలో సందర్శకులు, పర్యాటకులు వస్తున్నారు.




● నీట్ 2019-20

# విశేషస్థాయిలో విశ్వసాయి విజయభేరి

***జిల్లా విద్యారంగంలో 2010లో వికసించిన విద్యా కుసుమం విశ్వసాయి. ముందుగా ఇంటర్మీడియట్ తరగతులలో శిక్షణ ఇస్తూ ఒక్క బ్రాంచితో మొదలై అనతికాలంలోనే అంచెలంచెలుగా ఎదిగి నెల్లూరు నగరంతోపాటు 2016 నుండి తిరుపతిలో కూడా తమ ప్రతిభా ప్రభను వెలిగిస్తున్న సంస్థ విశ్వసాయి.***



2019-20 సంవత్సరానికిగాను జరిగిన 'నీట్' ప్రవేశ పరీక్షలలో 100కు పైగా విద్యార్థిని విద్యార్థులు యంబిబియస్‌లో ప్రవేశం పొందడంతో విశ్వసాయి మరోసారి విశేష స్థాయిలో విజయభేరి మోగించినట్లయ్యింది. గతంలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలలో కూడా ఈ సంస్థ మంచి ఫలితాలను సాధించింది. విశ్వసాయి మెడికల్ అకాడమీలో శిక్షణ పొందిన వారిలో సుమారు 120 మంది వైద్యశాస్త్రంలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు సంస్థ ఛైర్మెన్ సత్యనారాయణ చెప్పారు.

గత 10 సంవత్సరాలుగా తల్లితండ్రులు తమపై ఎంతో నమ్మకంతో తమ పిల్లలను విశ్వసాయిలో చేర్పిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ముకానీయకుండా తమ టీచింగ్ బృందం రేయింబవళ్లు శ్రమించి విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వెయ్యడంతోపాటు తల్లితండ్రుల కలలను నెరవేరుస్తున్నామని ఆయన అన్నారు.

అధ్యాపకుల అంకితభావం, విద్యార్థుల సహకారంతోనే తాము ఇంతటి గొప్ప ఫలితాలను సాధించగలుగుతున్నామన్న సంతృప్తిని సత్యనారాయణ వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో కూడా మానసిక స్థైర్యంతో తమ పిల్లలు పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించడం తమ సంస్థకు మంచి గుర్తింపును తీసుకురావడం ఆనందంగా ఉందని అన్నారు.

తమ సంస్థలో శిక్షణ పొందిన వి.వి. సాయిచరణ్ 639, ఆర్.దినేష్‌కుమార్ 637, యం.మునిలక్ష్మి 629, బి.వి. మాధవసాయి 617, సి.నమ్రత 611, బి.వి.కిషోర్ 610, పి.తేజస్వి 606, టి.శిరీష 605, ఎన్.శ్రీనిజ 603 మార్కులు సాధించి ముందువరసలో నిలిచారని చెప్పారు.

ఈ సందర్భంగా సంస్థ వైస్‌ఛైర్మన్ కృష్ణమోహన్ మాట్లాడుతూ అధ్యాపకుల నిరంతర శ్రమ, విద్యార్థుల అకుంఠిత దీక్షతోనే తాము ఈ ఫలితాలను సాధించగలిగామని చెప్పారు. తమ విజయాలకు కారకులైన విశ్వసాయి యాజమాన్యానికి, తమని తీర్చుదిద్దిన లెక్చరర్లకు పరీక్షల్లో విజయం సాధించిన విశ్వసాయి విద్యార్థి బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఒకే సంస్థనుండి 100 మందికి పైగా మెడికల్ సీట్లు సాధించే విధంగా తమ సంస్థను తీర్చిదిద్దిన సత్యనారాయణ అయ్యవారితో పాటు వారి సహచరులందరిని అభినందిస్తోంది 'లాయర్'.

## ప్రజల ఆరోగ్యం కోసం..
# రామాయణం పారాయణం

**- చినజీయర్‌స్వామి**

ప్రజలందరి ఆరోగ్యం కోసం, కరోనా వైరస్ నుంచి ప్రపంచం పూర్తిగా కోలుకుని అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ ప్రపంచవ్యాప్తంగా రామాయణ సామూహిక పారాయణం కార్యక్రమం చేపడుతున్నట్లు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి తెలిపారు. ఈనెల 20న ఆయన నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. స్వామీజీతో పాటు త్రిదండి అహోబిల జీయర్‌స్వామి కూడా విచ్చేశారు. వీరికి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, ఇ.ఓ వెంకటేశ్వర్లు, ఆలయ పూజారులు పూర్ణకుంభంతో సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ నవంబరు 6న పునర్వసు నక్షత్రం రోజునుంచి డిసెంబరు 4వ తేది పునర్వసు వరకు జరిగే సామూహిక రామాయణ పారాయణంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## వై.యస్ విగ్రహానికి పాలాభిషేకం



దేశ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా బీసీలకు ఇటు ప్రభుత్వ పరిపాలన అటు ప్రభుత్వ పథకాల పంపిణీలో పెద్దఎత్తున భాగస్వామ్యం కల్పించడమే కాక ప్రత్యేకించి 139 కులాలను 56 కార్పొరేషన్లుగా వర్గీకరించి ఒక నూతన నాయకత్వాన్ని తేవడానికి ఆయా కులాలకు చెందిన వారిని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఛైర్మెన్లు మరియు డైరెక్టర్‌లను ప్రకటించిన నేపథ్యంలో సంతోషం వ్యక్తం చేస్తూ గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు ఈ నెల 19వ తేదీ చెన్నూరులోని దివంగత ముఖ్యమంత్రి డా. వై.యస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశాడు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి సునీల్‌రెడ్డి, కొండారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రమణారెడ్డి, శేషగిరి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కాంట్ కలదు






## సంప్రదాయబద్ధంగా
# జెండా ఉత్సవం

గతంలోలా రంగుల విద్యుద్దీపాలు, భారీ సెట్టింగ్‌లు, వివిధ వేషధారణలు ఏవీ లేకుండా సంప్రదాయబద్ధంగా ఈ నెల 16వ తేదీ ఆంజనేయస్వామి జెండా మహోత్సవాన్ని గూడూరు పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహించారు. 50 వరకు జెండాలను ఆయా ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్ళలో ప్రజలే ఎత్తుకొని తిప్పి, నిలుపుదల చేశారు.

## వైజేపీ లయన్స్ ఆధ్వర్యంలో
# వృద్ధులకు పలసరుకులు



వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల గూడూరులోని డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణంలో వృద్ధులు, నిరాశ్రయులకు పలసరుకుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు కోవిడ్-19పై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వృద్ధులకు అవగాహన కల్పించారు. అలాగే నవంబర్‌లో నిర్వహించనున్న మెగా మెడికల్ క్యాంపు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నవీన్ జయకుమార్, సెక్రటరీ సుధాకర్, కోశాధికారి శివరామ్, లయన్ గురునాథం, ఆర్వీ రావు, పోస్ట్‌ప్రెసిడెంట్ మురళీనాయుడు, మంజులాదేవి, బాబు రావు, వీవీ సుబ్బారెడ్డి, పి.వి.సుధాకర్ పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు మరువలేం

**- డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి**



దేశ ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను మరువరాదని గూడూరు డిఎస్పీ రాజగోపాలరెడ్డి అన్నారు. గూడూరు పట్టణ టవర్‌క్లాక్ వద్ద బుధవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవ కార్యక్రమంలో డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సి.ఐలు జి.దశరథరామారావు, శ్రీనివాసులరెడ్డి, నరసింహరావు, ఎస్సైలు ఆదిలక్ష్మి, సైదులు పోలీసు సిబ్బందితో కలసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి పట్టణంలో కవాతు నిర్వహించారు. డిఎస్పీ మాట్లాడుతూ తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టడానికి సిద్ధపడి పోలీసు ఉద్యోగాన్ని ఎంచుకొని వచ్చిన వీరత్వంతో కూడిన వ్యక్తులకు మనస్ఫూర్తిగా గౌరవ వందనం తెలుపుతున్నామన్నారు.

# రవిచంద్రకు గూడూరు నాయకుల శుభాకాంక్షలు



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బీద రవిచంద్రకు గూడూరు టిడిపి నాయకులు ఈ నెల 20వ తేదీన ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీదను కలిసిన వారిలో గూడూరు మాజీఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ గూడూరు ఇన్‌ఛార్జ్ పాశం సునీల్‌కుమార్, గూడూరు పట్టణ పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, గూడూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు కొండూరు వెంకటేశ్వర రాజు, చిట్టమూరు మండల పార్టీ అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు, జిల్లా పార్టీ నాయకుడు బిల్లు చెంచురామయ్య, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీపతిబాబు, చిట్టమూరు మండల నాయకుడు జనార్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కస్తూరయ్యలు ఉన్నారు.

# అమ్మవారి ఆలయాలకు నవరాత్రి శోభ

## ❍ నేత్రపర్వంగా శరన్నవరాత్రి వేడుకలు
## ❍ విశిష్ట పూజలు, అలంకారాలతో ఆలయాలు కళకళ

*జిల్లాలో ఈనెల 17 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి. ఆలయాల్లో అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు, విశిష్టసేవలు, నేత్రపర్వంగా అలంకారాలు జరుగుతున్నాయి. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఆలయాల్లో ఏకాంతంగా పూజలు చేస్తున్నారు. ఆదిపరాశక్తి అయిన ఆ జగన్మాతను వివిధరూపాల్లో ఆరాధిస్తూ భక్తులు తరిస్తున్నారు.*



*'యా దేవీ సర్వభూతేషు*
*శక్తి రూపేణ సంస్థితా*
*నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై*
*నమో నమ:'..అంటోంది దేవీ సప్తశతి.*

ఈ సకల చరాచర ప్రపంచంలో శక్తి రూపంలో దేదీప్యమానంగా వెలుగుతుండేది ఆదిపరాశక్తి.. ఆ జగన్మాతే! త్రిమూర్తులకు అండగా ఉంటూ త్రిశక్తులైన ఇచ్ఛా, క్రియ, జ్ఞానశక్తులకు ప్రతిరూపమే జగన్మాత. శక్తిరూపంలోని 'శ' అంటే ఐశ్వర్యమని, 'క్తి' అంటే పరాక్రమమని, ఆదిశక్తి అయిన ఆ జగన్మాత సంకల్పంతోనే సృష్టి స్థితి లయాలు జరుగుతున్నాయని మన ప్రాచీనశాస్త్రాలు పేర్కొంటున్నాయి. ఎంతో మహిమాన్విత శక్తిస్వరూపిణి అయిన అమ్మవారిని పూజించుకుంటే సకల పాపాలు తొలగిపోయి సకల శుభాలు కలుగుతాయి. త్రిమూర్తులకు అండగా ఉంటూ త్రిశక్తులైన ఇచ్ఛా, క్రియ, జ్ఞాన శక్తులకు ప్రతిరూపమే జగన్మాత. లక్ష్మీదేవి, సరస్వతిదేవి, దుర్గాదేవిలను కూడా సృష్టించింది ఆ జగన్మాతే!..అని ఉపనిషత్తులు చెప్తున్నాయి.

అందులో భాగంగా నవరాత్రుల్లో శ్రీమాతను దుర్గామాతగా ఆరాధిస్తారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి దశమి వరకు జరిగే ఈ శరన్నవరాత్రి ఉత్సవాల్లో శక్తిరూపిణి అయిన ఆ దుర్గామాతను వివిధరూపాల్లో అలంకరించి ఆరాధిస్తుంటారు. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండరూపిణి, స్కందమాత, కాత్యాయిని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి.. ఇలా నవదుర్గ రూపాలను అలంకరణలుగా చేసుకుంటూ అమ్మవారిని భక్తితో స్మరించుకుంటూ ఆ జగదంబను ఈ నవరాత్రుల్లో భక్తులు ఎంతో నిష్టతో కొలుస్తుంటారు. జిల్లాలోనూ ఈ వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి.

### శాస్త్రోక్తంగా పూజలు..
### నేత్రపర్వంగా అలంకారాలు :

జిల్లాలో ప్రసిద్ధి చెందిన అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి వేడుకలు మరింత వేడుకగా జరుగుతున్నాయి. జొన్నవాడలో ఉన్న కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలోనూ, సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలోనూ, పెంచలకోనలోని శ్రీ ఆదిలక్ష్మీదేవి అమ్మవారి ఆలయం, నెల్లూరులోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం, మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో కొలువై ఉన్న భువనేశ్వరి అమ్మవారి మందిరం, రంగనాయకులస్వామి దేవాలయం.. ఇలా అన్ని అమ్మవారి దేవాలయాల్లోనూ నవరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. 17వ తేదిన కలశస్థాపనతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నవరాత్రుల్లో ఒక్కో రోజు ఒక్కో రూపంలో అమ్మవారిని పూజించడం, ఒక్కోరోజు ఒక్కో అలంకారం చేసి పూజలు చేయడం ఆనవాయితీ.

ఈనెల 25వ తేది వరకు జరిగే ఈ ఉత్సవాల్లో అమ్మవారిని వివిధరూపాల్లో అలంకరించి పూజలు చేస్తున్నారు. చండీ, భవాని, లలితాంబ, దుర్గాంబ, గాయత్రి, బాలత్రిపురసుందరి, అన్నపూర్ణ, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, గజలక్ష్మి, సరస్వతిదేవి, కాళికాదేవి, దుర్గాదేవి, మహిషాసురమర్ధిని, శ్రీ రాజరాజేశ్వరిదేవి తదితర అలంకారాలతో ఈ నవరాత్రుల రోజుల్లో అమ్మవారు దర్శనమిస్తారు. ఇప్పటికే ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి అమ్మవారి ఆలయాలు నవరాత్రి శోభలతో వెలుగొందుతున్నాయి. ఏ పేరున పిలిచే పలికే తల్లి.. దయామయి జగన్మాత ఒక్కటే. అందుకే అనేక రూపాల్లో, అనేక పేర్లతో అమ్మవారిని కొలుచుకుంటారు. సహస్ర నామపూజలు, శ్రీదేవి ఖడ్గమాల పూజలు, అష్టోత్తర పూజలు, చండీ యాగాలు, నవావరణ పూజలు, పల్లకీ సేవలు, పూలంగి సేవలు... ఇలా అనేక రకాల విశిష్టపూజలతో ఈ నవరాత్రుల్లో జగజ్జేయమానంగా వెలుగొందుతున్న అమ్మవారిని దర్శించుకుంటూ భక్తజనం తరించిపోతున్నారు.

అయితే ఈసారి కరోనా మహమ్మారి కారణంగా శరన్నవరాత్రి ఉత్సవాలను గతంలో వలె అంగరంగవైభవంగా జరుపుకునేందుకు వీలు లేకపోయినా, ఉన్నంతలో ఏకాంతంగా.. శాస్త్రోక్తంగా ఆలయాల్లో పూజారులు అమ్మవారికి విశిష్ట పూజలు చేస్తున్నారు. జిల్లాలోని అనేక ఆలయాల్లో కోవిడ్ నిబంధలను పాటిస్తూ.. భక్తులను దూరం నుంచే అమ్మవారి దర్శనానికి అనుమతిస్తున్నారు. అందరూ మాస్కులు ధరించే ఆలయాలకు వస్తున్నారు.

## చిన్న వ్యాపారులకు
# 'జగనన్న తోడు'

'జగనన్న తోడు' పథకం ద్వారా చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా 10వేల రూపాయల వంతున రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని, వారికి ఆ రుణంపై వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుందని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు తెలిపారు. ఈనెల 21న నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ 'జగనన్న తోడు', వైయస్సార్ బీమా అధికారులతో, బ్యాంకు అధికారులతో సమావేశమై ఈ పథకాలను సమీక్షించారు. 18 ఏళ్ళు దాటినవారికి, రోడ్డుపక్కన, ఫుట్‌పాత్‌ల వద్ద, తోపుడుబండ్ల మీద వ్యాపారం చేసుకునేవారు, తలపై గంపల్లో వస్తువులు తెచ్చి విక్రయించుకునేవారికి బ్యాంకుల ద్వారా ఈ రుణాలు మంజూరు చేయించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అనేకమంది ఈ రుణాలకు దరఖాస్తు చేసుకున్నారని, అయితే నిబంధనల పేరుతో వారికి బ్యాంకులు రుణాలివ్వడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని అంటూ బ్యాంకర్లు వెంటనే జగనన్న తోడు పథకాన్ని అర్హులకు అందించి రుణాలు మంజూరుచేయాలన్నారు. కరోనా మహమ్మారితో నష్టపోయిన చిరువ్యాపారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. వైయస్సార్ బీమా పథకం ద్వారా బియ్యం కార్డుదారులకు బీమా వర్తిస్తుందని, ప్రీమియం నగదును ప్రభుత్వమే చెల్లిస్తుదని చెప్పారు. బియ్యంకార్డులు కలిగిన కుటుంబాలతో బ్యాంక్ ఖాతాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జేసీలు ప్రభాకర్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రావు, జడ్పీ సిఇఓ సుశీల, డిఆర్‌డిఏ పి.డి నాగలక్ష్మి, డిపిఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

---

## భక్తుల పాలిట కల్పవల్లి...కోరిన కోర్కెలు తీర్చే చల్లనితల్లి...
# శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారు





***భక్తుల పాలిట కల్పవల్లిగా.. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా.. శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారు ఎంతో ప్రసిద్ధి. నెల్లూరు నగరంలోని దర్గామిట్టలో కొలువై ఉన్న ఈ ఆలయం ఎంతో మహిమాన్వితమైనది. నాలుగున్నర దశాబ్దాలుగా ఈ ఆలయం భక్తులందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. పర్వదినాల్లోనూ, విశిష్టమైన రోజుల్లోనూ అందులోనూ శరన్నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారి ఆలయ శోభ అంతా ఇంతా కాదు. ఈ ఆలయానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.***

**మన దేవాలయాలు (17)**

నెల్లూరు రాజరాజేశ్వరమ్మ దేవాలయమంటే జిల్లా ప్రజలందరికీ బాగా తెలిసిందే. 1968 ప్రాంతంలో శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వాములవారు ఈ ఆలయానికి శంకుస్థాపన చేశారు. తమిళనాడులోని తిరునల్వేలి జిల్లాలోని శ్రీ అరుళ్‌జ్యోతి నటరాజమూర్తి స్వామి ఆశ్రమ పీఠాధిపతులు, దేవీ ఉపాసకులైన శ్రీ అరుళ్‌జ్యోతి నటరాజస్వాములవారి దివ్య సంకల్పంతో, అమ్మవారి భక్తుడైన రత్నం మొదలియార్ కృషితో 1975 నాటికి ఈ ఆలయం ఎంతో సర్వాంగసుందరంగా రూపుదిద్దుకుంది. 1975 మార్చి 6వ తేదిన కంచికామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వాములవారు, శ్రీ శృంగేరి పీఠాధిపతుల ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి అర్చామూర్తిని ప్రతిష్టించి పూజలు ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపకులైన సి.రత్నస్వామి మొదలియార్ నేతృత్వంలో అమ్మవారికి అంగరంగ వైభవంగా మహాకుంభాభిషేక మహోత్సవం కూడా జరిగింది. ఆలయ నిర్మాణ నిర్వాహకులతో పాటు దాతలు అమ్మవారి ఆలయం అభివృద్ధికి సహకారం అందించడంతో ఆలయ ముఖమండపం, నవగ్రహ మండపం, మహామండపం వగైరాలన్నీ రూపుదిద్దుకున్నాయి. 1985లో ఈ ఆలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోకి రావడంతో ఆలయ వ్యవస్థాపక కుటుంబసభ్యులు, ఆలయ ధర్మకర్తల మండలి నేతృత్వంలో దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల సారధ్యంలో ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రముఖ దాతలు, అమ్మవారి భక్తులైన ఆల్తూరి కుటుంబం వారు ఇంకా పలువురు దాతలు ఈ ఆలయ అభివృద్ధికి సహకారం అందించడంతో ఆలయం మరింత శోభాయమానమైంది.


### వేలాదిగా భక్తులను ఆకట్టుకుంటున్న అమ్మవారి ఆలయం :

ఎంతో మహిమాన్వితమైన శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం నిత్యం భక్తుల రాకపోకలతో కళకళలాడుతూ ఉంటుంది. అమ్మవారిని నిండుభక్తితో ఆరాధిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని ప్రతీతి. పర్వదినాలు, ఉత్సవాల రోజుల్లోనైతే వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తరిస్తుంటారు. విశేషంగా ఆకట్టుకుంటున్న అయిదంతస్తుల రాజగోపురం అమ్మవారి ఆలయశోభను దేదీప్యమానం చేస్తుంటుంది. ఆలయం చుట్టూ ప్రహరీగోడకు అష్టలక్ష్ములు, దేశంలోనే ప్రఖ్యాతిచెందిన ఆలయాల నమూనాలు భక్తులను బాగా ఆకట్టుకుంటూ ఉంటాయి. ఆలయం నైరుతి భాగంలో ద్వాదశ జ్యోతిర్లింగ ప్రతిష్ట, నవగ్రహ మండపం, గాయత్రిదేవి మందిరం, శ్రీ సుందరేశ్వర స్వామి ఆలయం, వెనుకవైపు దక్షిణామూర్తి, నాగ పడిగలు భక్తులందరి పూజలందుకుంటున్నాయి.

### ఎంతో వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు :

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రతి ఏటా శరన్నవరాత్రి వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహిస్తుంటారు. కంచికామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వాముల వారి దివ్యాశీస్సులతో ఆగమ శాస్త్రానుసారం నవాహ్నికంగా శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ఇక్కడ విశిష్ట పూజలు నిర్వహిస్తున్నారు. ఉభయకర్తలు, దాతలు, భక్తుల సహకారంతో ఈ ఉత్సవాలు పెద్దఎత్తున జరుగుతుంటాయి. నవరాత్రుల రోజుల్లో కలశస్థాపనతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో ప్రతిరోజూ అమ్మవారికి ఒక్కో రూపాన్ని అలంకారంగా నయనమనోహరంగా అలంకరించి భక్తితో పూజలు చేస్తుంటారు. చండీ, భవాని, గాయత్రి, అన్నపూర్ణ, సరస్వతి, గజలక్ష్మి, కాళిక, దుర్గాదేవి, మహిషాసురమర్థిని అలంకారాలతో పాటు, విజయదశమి రోజున నేత్రపర్వంగా అమ్మవారికి చేసే శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారం మరింతగా కన్నులపండువ చేస్తుంది. ఈ ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు నెల్లూరు నగరంలోని భక్తులే కాక, జిల్లావ్యాప్తంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు.

# ఓ పోలీసన్నా.. నీకు వందనం...!



***పోలీస్... పోలీస్ అంటే భరోసా, పోలీస్ అంటే భద్రత, పోలీస్ అంటే ధైర్యం, పోలీస్ అంటే రక్షణ. వీవీఐపీలు వస్తున్నారంటే మూడురోజుల ముందు నుండే రోడ్లపై పహారా కాసేది పోలీసే, మనఇంట్లో దొంగలు పడ్డారంటే పరిగెత్తుకొచ్చేది పోలీసే, ఎక్కడైనా గొడవ జరుగుతుందని కాల్ చేస్తే ఆగమేఘాలమీద వచ్చి వాలేది పోలీసే, అస్తవ్యస్తమైన ట్రాఫిక్ వ్యవస్థని నిత్యం అదుపు చేసేది పోలీసే... ధర్నాలు, దొమ్మీలు, హర్తాళ్లు, స్ట్రైకులు, సభలు, సమావేశాలు, సాంస్కృతిక సంబరాలు, పెద్దోళ్ల ఇళ్లల్లో పెళ్లిళ్లు, కర్ఫ్యూలు ఆఖరుకి కరోనా లాంటి మహమ్మారి పుణ్యమా అంటూ విధించిన లాక్‌డౌన్‌ని ప్రాణాలని సైతం పణంగా పెట్టి సక్రమంగా అమలు చేసేది కూడా ఈ పోలీసే.***

దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, మానభంగాలు వంటివి జరగకుండా రాత్రీ పగలూ పహారా కాసేదీ పోలీసే. ఏదైనా హత్య జరిగితే ఆ హత్య రెండు రోజులకో మూడు రోజులకో వెలుగులోకి వస్తే... దుర్గంధ భూయిష్టంగా ఉన్న ఆ ప్రదేశానికి నేరుగా వెళ్లి సంఘటన జరిగిన చోటు నుండి ఆ మృతదేహాన్ని తరలించి, పోస్టుమార్టం చేయించి బాధితులకు అప్పజెప్పేదీ పోలీసే. ఘోరప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలను కాపాడేదీ పోలీసే. ఇలా చెప్పుకుంటే... అసలు పోలీసు వ్యవస్తే లేక పోయివుంటే... అని తలుచుకుంటేనే భయమేసిపోతుంది.

అలాంటి పోలీసంటే ఎందుకో చాలామందికి చిన్న చూపు, పోలీసు స్టేషనుకి వెళ్లాలంటే కొంతమందికి నామోషి మరికొంతమందికి భయం. పోలీసులంటే వారేదో అతీతమైన వ్యక్తులని, అదొక అవినీతి వ్యవస్థ అని ఒక అపోహ. అది చాలా తప్పు, ఎక్కడో ఒక్కరో ఇద్దరో అవినీతిపరులున్నారని మొత్తం వ్యవస్థకు ఆలా ముద్ర వెయ్యడం పొరపాటు. ఉగ్రవాదుల దాడులలో, నక్సలైట్ల ల్యాండ్‌మైన్‌లలో, ఎర్రచందనం గూండాల దాడులలో ప్రాణాలు కోల్పోతోంది ఈ పోలీసులే అని మనం గుర్తించాలి. మన కోసం భార్యాబిడ్డలని సైతం వదిలి రోడ్లపై కాపురం చేసేది ఈ వ్యవస్థే అని మనం గమనించుకోవాలి. మనల్ని కాపాడే వీరిని మనం గౌరవించుకోవాలి.

## ప్రాణాలకు తెగించి కరోనాలోనూ పనిచేస్తున్న మన పోలీసులు...

మన జిల్లాలో కూడా ఎందరో పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి పనిచేస్తుండడం నిత్యం మనమంతా చూస్తున్నదే. కోవిడ్ వైరస్ విజృంభించి కరోనా వ్యాధికి గురై ఆసుపత్రుల పాలైనవారిలో పోలీసులూ ఉన్నారు వీరిలో ఎంతోమంది ఆత్మస్థైర్యంతో కరోనాను జయించి.. తిరిగి వెంటనే విధులకు హాజరైనవారు కూడా ఉన్నారు. కేవలం విధి నిర్వహణకే పరిమితం కాక మరెందరో పోలీసులు సమాజానికి వ్యక్తిగతంగా కూడా ఎంతో సేవాభావంతో తమవంతు సేవలందించే మానవతామూర్తులు ఎందరో ఉన్నారు. రక్తదానాలు చేసేవారు, ఆపదల్లో ఉన్నవారిని ఆదుకునేవారు, నిరుపేదలకు తమవంతు చేయూతనందించేవారు పోలీసుల్లో కొల్లలుగా ఉన్నారు. అలాంటి పోలీసుల సేవాభావానికి..వారి చిత్తశుద్ధికి..విధి నిర్వహణలో వారి అంకితభావానికి హృదయపూర్వకంగా మనమంతా జేజేలు పలకాల్సిందే.

అన్నింటికన్నా ముఖ్యమైన విషయం మరొకటుంది. సమాజంలో శాంతిభద్రతలను భగ్నంచేసే అసాంఘిక శక్తులతో ఢీకొట్టడమంటే చిన్నవిషయమేమీ కాదు. హింసలు, రక్తపాతాలతో ప్రజల్ని భయోందోళనలకు గురిచేస్తూ సమాజాన్ని నాశనం చేసే ఉగ్రవాదులు, తీవ్రవాదులు, సంఘవిద్రోహశక్తులను ఎదుర్కోవడమంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ఆ దుండగులెప్పుడు ఎలాంటి హింసలకు పాల్పడతారో తెలియదు. అలాంటి వారి బారి నుంచి ప్రజలను రక్షించేందుకు పోలీసులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి ఉంటుంది. ఆ కర్తవ్యనిర్వహణలో తమ ప్రాణాలకు ముప్పు ఉన్నప్పటికీ విధి నిర్వహణే ఊపిరిగా, సమాజరక్షణే ధ్యేయంగా ఉంటూ దుండగులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అలా.. ఆ కర్కశమూకల చేతిలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులు కూడా ఎందరో ఉన్నారు. అలాంటి పోలీసు అమరవీరుల త్యాగాలను ఎవరూ.. ఏనాటికీ విస్మరించకూడదు. సమాజం కోసం, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ఆ అమరవీరులను ఎల్లవేళలా మనం గుర్తుంచుకోవాలి. అది మనందరి నైతిక బాధ్యతగా భావించాలి. ఎంతో క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన పోలీసు వ్యవస్థకు ప్రతిఒక్కరూ నిండు మనసుతో సహకరించాలి. విధినిర్వహణే ఊపిరిగా, సమాజ రక్షణే బాధ్యతగా ఉండే కర్తవ్యదీక్షాదక్షులు, సమాజసేవాపరాయణులు, ప్రజారక్షకులు, ప్రజా సేవకులు మన పోలీసులే...!

**అందుకే అంటున్నాం... ఓ పోలీసన్నా నీకు వందనం...!**

**(అక్టోబర్ 21 నుండి 10రోజుల పాటు పోలీసు అమరవీరుల సంస్మరణోత్సవాలు జరుగుతున్న సందర్భంగా...)**

● మన సతీష్‌రెడ్డి సారధ్యంలో మరో ఘనత

## సుదూర లక్ష్యాన్ని ఛేదించే..

# బ్రహ్మాండమైన బ్రహ్మాస్త్రం



***భారత రక్షణ, పరిశోధన సంస్థ(డిఆర్‌డిఓ) శాస్త్రవేత్తల అద్వితీయమైన ప్రతిభా పాటవాలకి నిదర్శనంగా అత్యంత అధునాతనమైన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని మన సతీష్‌రెడ్డి సారధ్యంలోని డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. ఈనెల 17న డిఆర్‌డిఓ ప్రయోగించిన ఈ క్షిపణి ప్రయోగం విజయవంతం కావడం విశేషం.***

డిఆర్‌డిఓ రూపొందించిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణిని కోల్‌కతా శ్రేణి డెస్ట్రాయర్ ఐఎన్‌ఎస్ చెన్నై నుంచి విజయవంతంగా ప్రయోగించడం జరిగింది. దేశీయంగా తయారుచేసిన ఈ క్షిపణిని భారత్ విజయవంతంగా ప్రయోగించింది. అరేబియా సముద్రంలో నిర్ధేశించిన లక్ష్యాన్ని ఈ క్షిపణి అత్యంత ఖచ్చితత్వంతో ధ్వంసం చేయడంతో డిఆర్‌డిఓ మరో అద్భుత విజయాన్ని సాధించినట్లయింది. సముద్ర జలాల్లో మోహరించిన శత్రుదేశాల నౌకలను ఛేదించగల శక్తిసామర్థ్యాలు ఈ బ్రహ్మాస్త్రానికి ఉన్నాయని, సుదూర లక్ష్యం ఉన్న ఉపరితల లక్ష్యాన్ని కూడా బ్రహ్మోస్ క్షిపణి ఛేదిస్తుందని డిఆర్‌డిఓ వెల్లడించింది. ఇది దూరం నుంచే శత్రుదేశాల యుద్ధనౌకలపై విరుచుకుపడే సామర్థ్యం కలిగి ఉంటుందని స్పష్టం చేసింది. దీంతో సముద్ర జలాలపై లక్ష్యాలను ఛేదించగలిగే సత్తా ఉన్న బ్రహ్మోస్ యుద్ధనౌక ఈ ప్రయోగ పరీక్షలో తన శక్తిని నిరూపించుకుంది. భారత్-రష్యా ఉమ్మడి భాగస్వామ్యంతో రూపొందించిన బ్రహ్మోస్ క్షిపణులు మన సైనిక పాటవాన్ని మరింత పెంపొందిస్తాయని వేరే చెప్పనక్కరలేదు. ఇలాంటి క్షిపణులు దేశ రక్షణకు ఎంతగానో ఉపకరిస్తాయని మన శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## అత్యంత శక్తివంతమైన క్షిపణులు

గత కొద్ది వారాలుగా భారత్ శరపరంపరంగా అస్త్రపరీక్షలను కొనసాగిస్తోంది. అనేక క్షిపణులను విజయవంతంగా పరీక్షిస్తోంది. బ్రహ్మోస్‌లో కొత్త వెర్షన్, యాంటీ రేడియేషన్ క్షిపణి రుద్రమ్-1, లేజర్ గైడెడ్ యాంటీట్యాంక్ గైడెడ్ క్షిపణి, అణ్వస్త్ర సామర్థ్యం ఉన్న 'శౌర్య' వంటి అద్భుతమైన క్షిపణులు వీటిలో ఉన్నాయి. కేవలం నెలరోజుల వ్యవధిలోనే 10 క్షిపణులను భారత్ విజయవంతంగా ప్రయోగించడం విశేషం. ఇవన్నీ దాదాపు 400కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సునాయాసంగా ఛేదించగల సత్తాకలిగినవే. అందులోనూ బ్రహ్మోస్ క్షిపణులను సబ్‌మెరైన్ల నుంచి, నౌకలు, యుద్ధవిమానాల నుంచి, భూతల వేదికల మీదనుంచి కూడా అద్భుతంగా ప్రయోగించవచ్చు. జలాంతర్గాములు, ఓడలు, విమానాలతో పాటు నేలపైనుంచి కూడా ఈ క్షిపణులను ప్రయోగించే వీలుంటుంది. అందుకే ఇది బ్రహ్మాస్త్రంగా పేరు తెచ్చుకుంది. భారత్-రష్యాలు ఉమ్మడిగా ఏర్పాటుచేసిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ఈ క్షిపణులను ఉత్పత్తి చేస్తోంది.

ఏదేమైనా... బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులతో సముద్ర జలాల్లో ఎలాంటి లక్ష్యాన్నయినా ఛేదించగలమని ఈ విజయంతో తేటతెల్లం చేసినట్లయింది. సరి హద్దుల్లో చైనా ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో బ్రహ్మోస్ ప్రయోగం విజయవంతం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్ ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధమన్నట్లుగా ఈ ప్రయోగ విజయంతో సంకేతాలిచ్చినట్లయింది.

## సతీష్‌రెడ్డికి రక్షణమంత్రి అభినందనలు

ఈ పరీక్ష విజయవంతం కావడం పట్ల భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డిని, డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలను ప్రత్యేకంగా అభినందించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణి రాకతో భారత నౌకాదళం మరింత దుర్భేద్యంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశరక్షణ రంగానికి అద్వితీయమైన అస్త్రాలను అందిస్తున్న డిఆర్‌డిఓకు, ఆ సంస్థ ఛైర్మెన్ మన సతీష్‌రెడ్డి దేశవ్యాప్తంగా సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.




# జగన్ తిరుగుబాటుతో ఏం జరగబోతోంది?..

(మొదటి పేజీ తరువాయి)

అల్లుడుగా ఆ ఇంట అడుగుపెట్టి, ఆ తరువాత ఆయనకే పంగనామాలు పెట్టి, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా వెలగబెట్టి, రెండెకరాల స్థాయినుండి రెండువేల కోట్ల స్థాయికి, ఆ తరువాత ఆ రెండువేల కోట్లను పదిరెట్లు పెంచే స్థాయికి ఎదిగిన చంద్రబాబునాయుడు ఇన్నాళ్లూ ఒక్క కేసులోనూ ఇరుక్కోకపోవడం, ఓటుకు నోటు కేసులో కూడా కేటు ఎవరో తేలక పోవడం వెనుక అసలు మర్మం ఏమిటో ఇప్పుడు రెండురాష్ట్రాల తెలుగు ప్రజలకే కాదు ఢిల్లీ పెద్దలకు కూడా తెలిసిపోయిందంటున్నారు రాజకీయ మేధావులు.

అలీబాబా నలభై దొంగలు తరహాలో తన చుట్టూ ఒక పటిష్టమైన కుల వ్యవస్థను కంచెగా వేసుకుని ఎక్కడా దొరకకుండా తన అక్రమాలను సాగిస్తున్న బాబు బండారం అల్లావుద్దీన్ అద్భుతదీపంలా ఒక్క లేఖతో జగన్ బయట పెట్టేశాడన్నది వారి అభిప్రాయం.

ఇప్పుడేం జరగబోతోంది...? సుప్రీం కోర్టు జగన్ ఫిర్యాదుపై ఎలా స్పందించబోతోంది..?? కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంలో ఎవరిని సమర్థిస్తుంది..?? ఇవీ ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్న ప్రశ్నలు.

అయితే ఇది ఆషామాషీ వ్యవహారం కాదన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. గతంలో కూడా అనేక మంది ముఖ్యమంత్రులు ఆయా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులపై సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేశారని, కానీ అవన్నీ రహస్య లేఖలకే పరిమితం కావడం గుట్టుగా సమస్య పరిష్కరించబడడం జరిగిపోయాయని, ఇప్పుడు జగన్ తన ఫిర్యాదు బాణాన్ని ఏకంగా త్వరలో ప్రధాన న్యాయమూర్తి కానున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తిపైనే ఎక్కుపెట్టి అటు న్యాయవ్యవస్థను, ఇటు కేంద్ర పాలనా వ్యవస్థను సందిగ్ధంలో పడేశాడన్నది వారి విశ్లేషణ.

భారత ప్రధాన మంత్రినీ, కేంద్ర హోంమంత్రిని కలసి బాబు, రమణల అవినాభావ సంబంధాల గురించి సాక్ష్యాధారాలను సైతం ఆంధ్రా ముఖ్యమంత్రి అందించాడు కాబట్టి కేంద్ర పెద్దలు కూడా ఈ విషయంలో పక్షపాత ధోరణితో వ్యవహరించకపోవచ్చు అన్నది కూడా వారి వాదన.

చంద్రబాబు విషయానికి వస్తే ముఖ్యంగా ఆయనకు కలిసివస్తున్నవి నాలుగు అంశాలు. మొదటిది అధికారం. అది ఇప్పుడు లేదు, ఇప్పట్లో రాదు. రెండవది ఆయనకు వెనుకనుండి నడిపిస్తున్న కులపెద్దైన ఒక అదృశ్య శక్తి. ఆ వ్యక్తి ఇప్పుడు రాజకీయాలకు దూరమైపోయాడు. ఇక మూడవ అంశం మీడియా. అందులోనూ ముఖ్యంగా ఈనాడు. ఆ పత్రిక వ్యవస్థాపకుడు వయోభారంతో వున్నాడు, ఒకవేళ ఈ మీడియాలు ఉన్నవి గోరంత, లేనివి కొండంత చేసి రాసినా... ఇప్పుడు సామాజిక మాధ్యమాల ధాటికి ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియాలు తట్టుకోలేకపోతున్నాయన్నది కాదనలేని వాస్తవం. నాలుగవ కీలక అంశం న్యాయ వ్యవస్థ, ఎన్ని అక్రమాలకు పాల్పడినా, ఎంతటి స్థాయిలో అవినీతిని పెంచి పోషించినా బాబుని ఇన్నాళ్లూ కాపాడుతూ వచ్చింది ఈ వ్యవస్థే, ఇదే బాబుకు మూలస్తంభం. ఇప్పుడు జగన్ ఆ స్తంబాన్నే టార్గెట్ చేశాడు కాబట్టి, అటు కేంద్రానికి ఇటు రాష్ట్రానికి కామన్ ఎనిమీ బాబే కావడంతో భాజపా కూడా ఈ విషయాన్ని చక్కగా వాడుకోవడానికి ఇష్టపడుతుందన్నది కూడా విశ్లేషకుల అంచనా.

ఈ పరిస్థితుల్లో ఎన్.వి రమణ కేంద్ర పెద్దలను శరణు జొచ్చినా, వాళ్ళు ఈయనను నమ్మే పరిస్థితి లేదని గతంలో చంద్రబాబు బీజేపీ పట్ల వ్యవహరించిన తీరు, ఆ పార్టీ నేతలపైన చేసిన ఆరోపణలు , కుట్రపూరిత మైన ప్రయత్నాలు వాళ్ళు అంత సులభంగా మర్చిపోలేకపోవడమే కాకుండా, బాబుతో రమణకి వున్న సాన్నిహిత్యంతో తమను కూడా ఇరకాటంలో పెట్టడన్న గ్యారంటీ లేదన్నది కూడా వారు ఆలోచిస్తారని విశ్లేషకులు చెప్తున్న మాట.

కేంద్రం యం.వి.రమణ పదోన్నతిని అడ్డుకోవడానికి జగన్ వ్యవహారంలో దర్యాప్తుకు(ఎంక్వయిరీ) ఆదేశించవచ్చు, లేదా అభిశంసన (ఇంపీచ్‌మెంట్)కు సిఫార్సుచేయొచ్చు అని మేధావులు అంచనా వేస్తున్నారు.

బాబు, రమణల సాన్నిహిత్యం గురించి మాజీ న్యాయమూర్తి జస్టిస్ బిఎస్ఏ స్వామి లాంటివాళ్లు బహిరంగంగానే మాట్లాడుతూ లోగుట్టును వెలికి తీస్తున్నారు కాబట్టి పై రెండు విషయాల్లో ఏ ఒక్కదానికి కేంద్రం సిఫార్సు చేసినా బయటకు రాని ఎన్నో విషయాలు ఒక్కసారిగా వెల్లువలా తెరపైకి వస్తాయన్నది కూడా విశ్లేషకుల వాదన. దర్యాప్తులు, విచారణలు ఒక కొలిక్కి వచ్చి నిజానిజాలు తేలేటప్పటికి రమణ పదవీ కాలం కూడా అయిపోవచ్చని, ఈలోగా ఆయన తరువాత అర్హత కలిగిన సీనియర్ న్యాయమూర్తిని ప్రధాన న్యాయమూర్తి పదవి వరించవచ్చని విశ్లేషకుల అభిప్రాయం.

మొత్తం మీద చంద్రబాబుని ఏకాకిని చేసి అన్నివిధాలా ఆయనను అడ్డుకునే ప్రయత్నంలో జగన్మోహన్‌రెడ్డి పెద్ద సాహసమే చేశాడని చెప్పాలి, అదనుకోసం ఎదురు చూస్తున్న ఢిల్లీ పెద్దలకు ఈ అంశాన్ని ఒక ఊతంలా అందించాడు, వేచిచూద్దాం ఏం జరుగుతుందో....!

# 'అచ్చెన్న' అచ్చొచ్చేనా?

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువ శాతం బీసీలకు ప్రాధాన్యత కల్పించడంతోపాటు బీసీ నాయకుడు అచ్చెన్నాయుడిని రాష్ట్ర అధ్యక్ష పదవిలో కూర్చోబెడుతున్నాడు ఆ పార్టీ జాతీయ నాయకుడు నారా చంద్రబాబునాయుడు. ఇక్కడో విచిత్రమేమి టంటే నందమూరి బాలకృష్ణ సొంత పార్టీలోనే ఆయన్ని పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నియమించాడు. వాస్తవానికి ఇది ఎన్‌టిఆర్ పార్టీ. అంటే... బాలకృష్ణ ఇంటి పార్టీ. పాపం ఇప్పుడు వాళ్ళ బావ, ప్లస్ వియ్యంకుడు. ఆయనను ఆయన పార్టీలోనే పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నియమించాడు. తన తరువాత తన కొడుకు లోకేష్ వారసత్వపగ్గాలు చేపట్టాలన్న థియరీ తెలిసిన బాబుకి రామారావు తరువాత ఆయన కొడుకు పార్టీ పగ్గాలు చేపట్టాలన్న లాజిక్ తెలియలేదేమో.

ఈసారి 27 మందితో కేంద్ర కమిటీని, 25 మందితో పొలిట్‌బ్యూరోని ఏర్పాటు చేశారు. ఈ 25 మందిలో ముగ్గురు, అంటే అచ్చెన్నాయుడు, నారా లోకేష్‌లతో పాటు పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు. గతంలో 17 మందితో ఉండిన పొలిట్‌బ్యూరో సభ్యుల సంఖ్యని మరో ఎనిమిదికి పెంచి 25 చేశారు. నెల్లూరుజిల్లా నుండి సీనియర్ నాయకుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఈ పొలిట్‌బ్యూరోలో సభ్యుడిగా మరోసారి అవకాశం కల్పించారు.

తొలి నుండీ పార్టీకి విధేయుడిగా వుంటూ రాష్ట్ర తెలుగు యువత, జిల్లా పార్టీ అధ్యక్ష పదవులతోపాటు పార్టీలో పలు విభాగాలలో పనిచేసిన ప్రస్తుత ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు కేంద్ర పార్టీలో ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టారు.

మొత్తానికి దేశం కొత్త దళం సమరానికి సన్నద్ధమవుతోంది. కాస్త నోరున్నోళ్లకు ఈసారి పార్టీలో కీలక పదవులు ఇచ్చారు. వాళ్ళల్లో ముఖ్యుడు అచ్చెన్న. ఆయన ఇప్పుడు రాష్ట్ర పార్టీకి అధ్యక్ష్యుడు. చూద్దాం... అచ్చెన్న సారధ్యం పార్టీకి ఎంతవరకు అచ్చొస్తుందో ..!

వీక్షణం

- మంజీర

# దూషణ కన్నా... ప్రియభాషణ మిన్న

*'ఏమండీ! వచ్చే ఏడాది వేసవిలో కొడైకెనాల్ టూర్‌కెళ్దామా' అడిగింది భార్య.*

*'కొడైకెనాల్ చూడడానికి అంత శ్రమపడి వెళ్లడం ఎందుకు? యూట్యూబ్‌లో టూర్ వీడియోలుంటాయి చూడు' అని తన కంప్యూటర్‌లో తల దూర్చేశాడు భర్త.*

*మరో రెండు గంటల తర్వాత...*

*"భోజనం చేద్దామా" కంప్యూటర్ షట్‌డౌన్ చేస్తూ భార్యతో అంటాడా భర్త.*

*"యూ ట్యూబ్‌లోకెళ్లండి. మన భోజనం కావాలంటే సౌతిండియన్ థాలీ అని సెర్చ్ చేయండి. షడ్రసో పేతమైన భోజనం కనిపిస్తుంది. నెల్లూరు చేపల పులుసు, రాయలసీమ నాటు కోడి పులుసు, హైదరాబాద్ బిర్యానీ, నార్త్ ఇండియన్, చైనీస్ థాయ్ ఫుడ్, కాంటినెంటల్... ఏది కావాలంటే అది చూసుకోండి. కడుపు నిండిపోతుంది" తన స్మార్ట్ ఫోన్‌లో కొడైకెనాల్ టూర్ వీడియో చూస్తూ తల తిప్పకుండానే బదులిచ్చింది భార్య.*

డిజిటల్ మీడియా మన జీవితాల్లోకి ఎంత విస్తృతంగా వాడుకలోకి వచ్చిందో తెలియచేసే ఓ సరదా సన్నివేశం ఇది. డిజిటల్ డయాస్ మీద ఉన్న సమాచారాన్ని మనం తీసుకోవడం వరకు స్వాగతించాల్సిన విషయమే. అయితే ఇబ్బందులన్నీ తమ గురించి వివరాలను ప్రపంచంతో పంచుకోవడంలోనే వస్తోంది. దైనందిన కార్యక్రమాలను కూడా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడం, లైకుల కోసం ఎదురు చూడడం, ప్రశంసలు రాకపోతే ఆందోళన చెందడం, విమర్శలు వస్తే ఆవేశపడిపోవడం మామూలైపోయింది. ఆ విమర్శించిన వారిని గుర్తు పెట్టుకుని సమయం వచ్చినప్పుడు వారి మీద అంతకు అంతా తీర్చుకోవాలనే పగలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. కొంతసేపు వాదనలు సాగిన తర్వాత ఇక ఆ మాటల యుద్ధాన్ని అక్షరాలతో కొనసాగించగలిగిన ఓర్పును కూడా కోల్పోయి, వారికి నేరుగా ఫోన్ చేసి దాడికి దిగుతుంటారు. ఇదంతా తాము ఆధునిక జీవులం అనుకునే అపరిపక్వ జీవుల డైలీ రొటీన్. అలాగే తమకు ఇష్టం లేని వ్యక్తి ఒక పోస్ట్ పెడితే ముందు వెనుకలు ఆలోచించకుండా వ్యక్తిగతదూషణకు దిగిపోయేవాళ్లు కూడా ఎక్కువైపోయారు. కొన్ని చర్చలు హుందాగా మొదలై క్రమంగా రాజకీయాల వైపు మళ్లడం, తమకు నచ్చిన నాయకుడిని విమర్శించిన వారి మీద పేట్రేగిపోయేవాళ్లు రోజూ అభౌతికంగా తారసపడుతూనే ఉంటారు. ఇది సామాజిక మాధ్యమంలో సాగుతున్న వ్యక్తుల సామాజిక కోణం. ఇక సామాజిక మాధ్యమంలో 'వ్యక్తిగత జీవితాలను ప్రదర్శనకు పెట్టడం' అనే జాఢ్యం కూడా పరాకాష్టకు చేరిపోయింది. ఇటీవల కేరళలో చోటు చేసుకున్న సంఘటనే అందుకు అతి పెద్ద ఉదాహరణ.

## డిజిటల్ లైఫ్

కేరళలోని లక్ష్మి, రిషి అనే యువతీ యువకులు పెళ్లి చేసుకున్నారు. ప్రీ వెడ్డింగ్ ఫొటో షూట్‌లు, పోస్ట్ వెడ్డింగ్ ఫొటో షూట్‌లూ మామూలైపోయిన రోజులివి. ఈ దంపతులు కూడా పోస్ట్ వెడ్డింగ్ ఫొటో షూట్ చేసుకున్నారు. ఎవరి అభిరుచికి తగినట్లు వారు చేసుకుంటారు. అలాగే వీళ్లు ఈ వేడుకను అత్యంత శృంగార భరితంగా నిర్వహించుకున్నారు. అది వాళ్ల సొంతం. తప్పొప్పుల బేరీజు వేయడానికి ఎవరికీ ఎటువంటి అర్హతలు ఉండవు. అలాగే సోషల్ పోలీసింగ్ చేయడానికి, తీర్పులిచ్చేయడానికి కూడా ఎవరికీ ఏ విధమైన హక్కులు ఉండవు. అయితే... లక్ష్మి, రుషిలు ఆ ఫొటోలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఇక్కడ ఆక్షేపించాల్సిన విషయం ఆ ఫొటోలను ప్రపంచం ముందు ప్రదర్శనకు పెట్టడాన్ని మాత్రమే. 'జీవితంలో ఏ విషయాన్ని పదుగురితో పంచుకోవాలి, ఏ విషయాన్ని గోప్యంగా ఉంచుకోవాలి' అనే సరిహద్దు రేఖను మర్చిపోతోంది యువతరం. శృంగార జీవితం ఆనందాల హరివిల్లులా మారడం దంపతుల అన్యోన్యతకు ప్రతీక. తీపి జ్ఞాపకాలకు ప్రతిరూపాలైన ఫొటోలను జీవితకాలం దాచుకోవాల్సిందే. అయితే ఆ అన్యోన్యత, దాంపత్య జీవితం 'ఇద్దరి' సొంత జీవితం. ఆ ఇద్దరూ ఇష్టపూర్వకంగానైనా సరే 'తమ' జీవితాన్ని సమాజ పరం చేయరాదు. 'మంచిగా కావచ్చు, చెడుగా కావచ్చు... మరొకరు కామెంట్ చేసే అవకాశం ఇవ్వకూడదు'. పాశ్చాత్యీకరణ మన జీవితాలను సౌకర్యవంతం చేసుకోవడానికి, అభివృద్ధి పథంలో నడిపించే విషయాలకే పరిమితం చేసుకుంటే మంచిది. ఆ సమాజం మనది కాదు, కాలేదు కూడా.

## తీర్పరితనం

అత్యంత సులువైన పని 'ఒకరికి సలహా ఇవ్వడం'. అత్యంత కష్టమైన పని ఆ సలహాను పాటించడం. సోషల్ మీడియాను ఆసరా చేసుకుని సమాజంలో ప్రతి ఒక్కరూ మరొకరి జీవితంలో దూరిపోతున్నారు, వారి సొంత విషయంలో కూడా వీళ్లే తీర్పరులయిపోతున్నారు. తమకు నచ్చని పని చేసిన వారిని దూషించి హితవు చెప్పే సామాజిక శ్రేయోభిలాషులుగా మారిపోతున్నారు. ఇది నిజానికి మనిషి సహజ లక్షణమే. గతంలో తన ఊరి వారి విషయంలో తమ తెగడ్తలను ఇరుగింటి పొరుగింటి వారితో మాత్రమే పంచుకునే వారు. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వందల మంది విషయంలో స్పందిస్తున్నారు. ఏది ఏమైనా... ఒకరిని వేలెత్తి చూపించే క్రమంలో మూడు వేళ్లు మనల్నే చూపిస్తుంటాయనే సూక్తిని మర్చిపోకూడదు. లక్ష్మి, రిషిల ఫొటోలు చూసినవాళ్లు... చేతనైతే వాళ్లకు హితవుచెప్పాలి తప్ప దూషించడం ఎంత మాత్రమూ సరికాదు. ప్రైవేట్ ఫొటోలను షేర్ చేయకూడదనే విచక్షణ వారికి లోపించింది. సరే... వారిని తిట్టిపోస్తున్న వారిలో లోపించిన లక్షణం ఏమిటి? విజ్ఞతేనా! ఒక్క విజ్ఞత మాత్రమే కాదు.. సంస్కారం కూడా. ఇతరులను తప్పు పట్టడం ద్వారా తమను తాము ఉత్తములుగా, మహోన్నతులుగా ప్రదర్శించుకునే ఆధిక్య భావన ఒకటి. అయినా మరొకరిని వేలెత్తి చూపించడానికి మనం ఎవరం అనే ప్రశ్న ఎవరికి వారు వేసుకుంటే ఈ సోషల్ బుల్లీయింగ్ ఉండదు. సంప్రదాయాన్ని తమ భుజాల మీదనే మోస్తున్నట్లు భుజకీర్తులు తగిలించుకుని, తిట్ల దండకం మొదలు పెడితే నవతరం భయపడుతుందనుకుంటే పొరపాటే. వయసులో పెద్ద వాళ్లు ఒక మంచిమాటతో యువతరాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తే... కొత్త తరం ఒక్క క్షణం ఆలోచనలో పడుతుంది, పరిణితితో వ్యవహరిస్తుంది. అందుకోసం మనం దూషణ మాని.. ప్రియభాషణం చేద్దాం!

# 6వ వర్ధంతి



అందరి హృదయాలలో సుస్థిర స్థానమేర్పరుచుకుని,
నిండు నూరేళ్ళు పరిపూర్ణ జీవితాన్ని సాగించిన ప్రేమానురాగాల దీప్తి,
మా అభివృద్ధికి కారకురాలు, దైవసమానులు

## కీ॥శే॥ శ్రీమతి గునుపాటి రుక్మిణమ్మ గారు

పరమపదించి తేది 30-10-2020 నాటికి
ఆరేళ్ళు పూర్తికానున్న సందర్భంగా వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని
ఆ భగంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము

**కుమారులు - కోడళ్ళు**
గునుపాటి వెంకటకృష్ణారెడ్డి - ఇందిరమ్మ
గునుపాటి జనార్థన్‌రెడ్డి - సునీతమ్మ
గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి - శుభప్రదమ్మ

**కుమార్తెలు - అల్లుళ్ళు**
కోటిరెడ్డి నిర్మలమ్మ - కీ॥శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి
అత్తివరపు విమలమ్మ - అత్తివరపు రామచంద్రారెడ్డి
కీ॥శే॥ దొడ్ల లలితమ్మ - దొడ్ల పద్మనాభరెడ్డి

మరియు
**మనుమలు, మనుమరాళ్ళు, ముదిమనుమలు, ముదిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: lawyerpatrika@gmail.com